Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 14.11.2014, శుక్రవారం | సంపుటి : 34 సంచిక : 24 | పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# బుద్ధప్రదేశ్ కోసమే సింగపూర్

- రాజధాని నిర్మాణానికి సింగపూర్ సహకారం
- అమరావతిని బౌద్ధ సంస్కృతి కేంద్రంగా మార్చడానికి శ్రీకారం

**రాష్ట్ర రాజధానిపై సర్వత్రా నిరసన వ్యక్తమైనా, అక్కడ రాజధాని పెడితే భవిష్యత్‌లో అరిష్టాలు తప్పవని రాజధానిపై కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటి హెచ్చరించినా, అక్కడే రాజధాని పెడితే బంగారం లాంటి భూములు పాడైపోతాయని మేధావులు సూచించినా... ముఖ్యమంత్రి చంద్రబాబు వాటన్నింటిని పెడచెవిన పెట్టి విజయవాడ సమీపంలోనే రాజధాని అంటూ ప్రకటించాడు. ఇక కష్టమైనా నష్టమైనా అక్కడ రాజధాని ఏర్పాటు చేసుకోవాల్సిందే!**

అయితే చంద్రబాబు పట్టుబట్టి ఇక్కడే రాజధాని పెట్టడానికి మూలకారణం 'అమరావతి' పట్టణమేననిపిస్తుంది. విజయవాడ, గుంటూరు నగరాలను కాకుండా అమరావతి పట్టణాన్ని ప్రధాన రాజధాని కేంద్రంగా మార్చే ఆలోచన వుంది. దీనికి కారణం అమరావతికి బౌద్ధ సంస్కృతికి సంబంధం ఉండడమే. బుద్ధ సంస్కృతి సెంటిమెంట్‌తోనే ఇప్పుడు నూతన రాజధాని నిర్మాణానికి చంద్రబాబు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం (మిగతా 10వ పేజీలో)

## చిన్నారుల కేరింతలతో...

# ఆనందోత్సవంగా బాలల దినోత్సవం





**నవంబర్ 14వ తేదీ... మాజీప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిరోజు. ఆయనకు చిన్నారులంటే ఇష్టం. అందుకే ఆయన జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. అయితే ఇంతవరకు ఎన్ని నవంబర్ 14లైనా వచ్చి ఉండొచ్చు... కాని 2014 నవంబర్ 14కు మాత్రం ఒక ప్రత్యేకత చోటుచేసుకుంది. 'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో నెల్లూరు పురమందిరం నందు నిర్వహించిన బాలల దినోత్సవం బాలల ఆనందోత్సాహాలకు వేదికగా నిలిచింది. కిక్కిరిసిన వివిధ పాఠశాలల చిన్నారుల కేరింతలతో టౌన్‌హాల్ మార్మోగిపోయింది.**

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 125వ జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈరోజున 'లాయర్' నిర్వహించిన బాలల దినోత్సవంలో సింహపురి చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభావంతులైన చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఓ పక్క చిన్నారిలోకాన్ని మైమరపిస్తే, ఇంకోపక్క ముఖ్యఅతిథులుగా వచ్చిన పెద్దలు ఆశీస్సులతో ఇచ్చిన అభిభాషణ వారిలో స్ఫూర్తిని నింపింది.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 125వ జయంతిని పురస్కరించుకుని 'లాయర్' ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన నెల్లూరు పురమందిరం నందు నిర్వహించిన బాలల దినోత్సవం కనీవిని ఎరుగని రీతిలో విజయవంతమైంది. నగరంలోని ఆయా పాఠశాలల విద్యార్థులు టౌన్‌హాల్‌కు పోటెత్తినట్లు వచ్చారు. హాలు నిండి కొందరు విద్యార్థులు నిలుచోవాల్సివచ్చినా ఎవరూ అసౌకర్యంగా భావించకుండా

చిత్రమాలిక 6, 7 పేజీలలో...
(మిగతా 10వ పేజీలో)

# సైకిలెక్కిన ఆ నలుగురు

ఎన్నికలకు ముందే రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ *90*శాతం ఖాళీ అయిపోయింది. ఎన్నికల తర్వాత మిగిలిన ఆ *10*శాతం మంది కూడా జారుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను నమ్ముకుంటే బ్రతుకు, భవిష్యత్ ఉండవనేది అర్థమైపోతుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నుండి అధికార తెలుగుదేశం పార్టీలోకి వలసలు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నాయకులు, ఒక జైసమైక్యాంధ్ర నాయకుడు టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరిపోయారు.

(మిగతా 10వ పేజీలో)



# నత్తతో పోటీ పడుతున్నారా?




నెల్లూరుజిల్లా పుట్టంరాజువారి కండ్రిగలో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ అధికారులపై జేసీ రేఖారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్ దత్తత తీసుకున్న గూడూరురూరల్ పరిధిలోని పుట్టంరాజు వారి కండ్రిగలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు మంగళవారం జేసీ రేఖారాణి ఆ గ్రామానికి చేరుకున్నారు. జరుగుతున్న అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండడం గమనించి తహశీల్దార్, ఎంపిడిఓ, ఆర్ అండ్ బి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని నివాసప్రాంత రోడ్లను, డ్రైనేజీలను పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రాజ్యసభసభ్యుడు సచిన్ టెండూల్కర్ ఈ నెల 16న పుట్టంరాజువారి కండ్రిగకు వస్తున్నందున జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన పరిశీలిస్తారని ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగకపోవడం అసంతృప్తిగా ఉందన్నారు. ఆర్డీఓ, తహశీల్దార్, ఎంపిడిఓలు గ్రామంలోని 30ఇళ్ల చొప్పున తీసుకుని వాలంటీర్ల సహాయంతో పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు మెరుగు పరచాలని ఈ విధానం 4రోజుల్లో పూర్తి కావాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జేసీతో పాటు ఆర్డీఓ జి.రవీందర్, తహశీల్దారు వెంకట నారాయణమ్మ, ఎంపిడిఓ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# కట్ట కాదు... గోడ కట్టండి

సూళ్లూరుపేటలో ప్రవహించే కాళంగి నదికి వరద కట్ట ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని, దాని స్థానంలో గోడ కడితే చాలని నీటిపారుదల శాఖకు నిపుణుల కమిటీ సూచించింది. ఈ నెల 8న సాగునీటి పారుదల నిపుణులకమిటీ సభ్యులు సి.హెచ్.వీరయ్యచౌదరి, కె.వి.సుబ్బారావు, ఎం.గిరిధర్‌రెడ్డిలు కాళంగి నది ప్రాంతాన్ని పరిశీలించారు. ఇటీవలే మాజీఎమ్మెల్యే పరసా రత్నం, తెలుగుదేశం నాయకులు వేనాటి రామచంద్రారెడ్డిలు ఈ విషయాన్ని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో మంత్రి ఆదేశాల మేరకు నిపుణుల కమిటి వచ్చింది. వరద కట్ట కట్టాలంటే భూ సేకరణ జరగాలి, నదికి ఇరువైపులా ప్రైవేట్ భూములున్నందున అది వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని కాబట్టి నదికి ఇరువైపులా గోడ కడితే సరిపోతుందని కమిటి సభ్యులు అభిప్రాయపడ్డారు. వరదకట్ట డిజైన్‌ను పరిశీలించి దానిని ఉపసంహరించుకోవాలని కూడా చెప్పారు.

అలాగే కమిటి సభ్యులు డి.వి.సత్రం మండలం నెలబల్లి వద్ద ఆగిపోయిన తెలుగుగంగ 7వ బ్రాంచ్ కాలువ, 14 ఆర్ మేజర్ కాలువలను కూడా పరిశీలించారు. అలాగే నేలపట్టు చెరువుకు నీళ్లందించే పనులతో పాటు మరికొన్ని గ్రామాల చెరువులకు నీళ్లందించే విషయాలను కూడా పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీఎమ్మెల్యే పరసా రత్నం, తెలుగుగంగ సిఇ చిట్టిబాబు, నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కోటేశ్వరరావు, ఇఇ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# చెయ్యి తడిపితేనే ఆధార్...

## అవస్థల్లో విద్యార్థులు

నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెంలోని ఆధార్ కేంద్రంలో చేతివాటం మతలబుతో విద్యార్థులు నానా అవస్థలకు గురవుతున్నారు. ప్రభుత్వం ప్రతి పథకానికి ఆధార్‌ను తప్పనిసరి చేయడంతో ప్రతిఒక్కరూ ఆధార్ కేంద్రంకు క్యూకడుతున్నారు. ప్రభుత్వం ఆధార్‌ను అందించేందుకు మండల కేంద్రానికి ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం నిర్వహించకుండా బయట వ్యక్తులకు ఇవ్వడంతో చెయ్యి తడపందే ఆధార్ ఇచ్చే ప్రసక్తే లేదు. మొదట రూ.50లు మాత్రమే వసూలు చేస్తున్న ఆధార్ నిర్వాహకులు ప్రస్తుతం రూ.200లు వసూలు చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇక విద్యార్థులకు కావలసిన సర్టిఫికెట్ల కొరకు తహశీల్దార్ కార్యాలయాలకు వెళితే అక్కడి కంప్యూటర్ ఆపరేటర్ మధ్యవర్తుల ద్వారా రూ.200లు నుంచి రూ.300లు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి అయినా విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించి డబ్బులు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ప్రజలు ఆశిస్తున్నారు.

# ఉచిత వైద్యశిబిరం

నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నెల్లూరు రెయిన్‌బో హాస్పిటల్, ఇందుకూరుపేట ఉపసర్పంచ్ కందల వెంకటప్రసాద్, యువచైతన్య సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కిడ్నీ వ్యాధి నిపుణులు కె.ఆనందబాబు జనరల్ ఫిజిషియన్ వి.మహేష్‌లు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీనివాసరావు, సిబ్బంది ముజాయిద్, ఉమ, లక్ష్మి కుమారి, పిఆర్‌ఓ హర్ష ఇందుకూరుపేట యువచైతన్య సేవాసమితి అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల జలాశయం

# సామర్థ్యంపై ప్రత్యేకదృష్టి

నెల్లూరుజిల్లా సోమశిల జలాశయంలో పూర్తిగా 78టిఎంసీల సామర్థ్యం పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎస్ఇ సజ్జాద్ పేర్కొన్నారు. మంగళవారం జలాశయాన్ని అటవీశాఖ అధికారులు కెవిఎస్‌రెడ్డి, ఏపిసిసిఎఫ్ జయదేవ్, ప్రొద్దుటూరు డిఆర్‌ఓ శివశంకర్, కావలి ఏసిఎఫ్ నాగభూషణంలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ అటవీ అధికారులు అనుమతి ఇస్తే జలాశయంలో పూర్తి సామర్థ్యం నీటిని నింపవచ్చన్నారు.

# దేశం సభ్యత్వానికి విశేషస్పందన

నెల్లూరుజిల్లా కావలి రూరల్ మండలం పెద్దపట్టపుపాళెం గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేషస్పందన లభించింది. ఈ కార్యక్రమంలో కావలి మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు పర్రి మహేశ్వరి, నూతనంగా ఎన్నికైన రూరల్ మండల అడ్‌హక్ కమిటి కన్వీనర్ పాలడుగు రంగారావు, మాజీ జడ్పీటీసీ నాయుడు రాంప్రసాద్, మండల ఉపాధ్యక్షులు వాయల శ్రీనుబాబు, కో–ఆప్షన్ మెంబర్ షేక్ ఖలీల్, అడ్‌హక్ కమిటి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్రి మహేశ్వరి మాట్లాడుతూ కావలి రూరల్ మండలంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటి సభ్యులు కోసూరి కోటేశ్వరరావు, చాగంటి వెంకటేశ్వర్లు, ఉప్పాల వెంకయ్య, తిరుపతి జయమ్మ, జ్వాలారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో పోలీసుల ముమ్మర తనిఖీ

నెల్లూరుజిల్లా తడలోని శ్రీకాళహస్తి కూడలి వద్ద ఆదివారం తెల్లవారు జామున పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా దాదాపు రూ.25లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు లభ్యమయ్యాయి. స్థానిక ఎస్ఐ అబ్దుల్ రజాక్ కథనం మేరకు శ్రీకాళహస్తి రోడ్డు కూడలి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించగా చెన్నై నుంచి శ్రీకాళహస్తికి వెళుతున్న కారులో 800గ్రాముల బంగారు ఆభరణాలు, 13.5కేజీల వెండి వస్తువులు గుర్తించి, వీటికి సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో పోలీసులు అనుమానంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. బంగారు విలువ దాదాపు రూ.21లక్షలు, వెండి విలువ దాదాపు రూ.4.5లక్షలు ఉంటుందని అంచనా వేశారు. శ్రీకాళహస్తికి చెందిన జె.మదన్‌కుమార్ బంగారు వ్యాపారస్తుడని, అతను కారుడ్రైవర్ శరత్‌కుమార్‌తో కారులో చెన్నై నుంచి శ్రీకాళహస్తికి ఈ బంగారు, వెండి ఆభరణాలను ఎటువంటి బిల్లులు లేకుండా శ్రీకాళహస్తికి తరలిస్తూ పట్టుపడ్డాడని తెలిపారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కరుణామయి ఉచిత వైద్య శిబిరం

నెల్లూరుజిల్లా రాపూరు మండలం పులిగిలపాడులో ఆదివారం శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమట్రస్ట్ వారి కరుణామయి వైద్యశాల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాపూరు మండలంతో పాటు సైదాపురం మండలం, డక్కిలి మండలం, వెంకటగిరి, కలువాయి, కడపజిల్లా చిట్వేల్ మండలం ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈ శిబిరంలో ప్రముఖ డాక్టర్లు ఎ.పెంచలయ్య, నిర్మలమ్మ, నాగకుమార్, అనుతోష్‌కుమార్, ప్రసన్న, రాజ్‌గురు, అనిల్‌కుమార్, మౌర్య, కరుణకుమార్‌రెడ్డి, శశికాంత్, శాంతి, అమర్‌రఘునారాయణ, సుప్రజ, శ్రీ కరుణామయి వైద్యులు విక్టోరియా, బాలాజీ మురళిరాజు, శ్రీనివాసులు పాల్గొని రోగులను పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు రామ్మోహన్‌రావు విలేకర్లతో మాట్లాడుతూ విచ్చేసిన రోగులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరానికి గర్భకోశ వ్యాధులు, ఎముకలు సమస్య, గ్రహణమొర్రి, కంటిశుక్లాల వ్యాధుల బాధితులు ఎక్కువమంది వచ్చారని, వీరికి జనవరి 2 నుండి 4తేదీ వరకు నెల్లూరులోని నారాయణ వైద్యశాలలో కరుణామయి ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.

# కూరగాయల సాగుకు విద్యార్థుల శ్రీకారం

నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బిసి సంక్షేమశాఖ బాలుర వసతిగృహానికి చెందిన విద్యార్థులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివిధ రకాల కూరగాయలు పండించేందుకు విద్యార్థులు ఆ దిశగా సాగు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. వసతిగృహంలోని ఖాళీస్థలంలో పిచ్చిచెట్లను తొలగించి కూరగాయల సాగుకు సంసిద్ధమయ్యారు. వసతిగృహం సంరక్షణ అధికారి రమణయ్య సహకారంతో విద్యార్థులు రైతులుగా మారారు. 10రోజుల క్రితం కాకరకాయలు, బెండ, చిక్కుడు, వంగ, గోంగూర, విత్తనాలు నాటి ప్రతిరోజూ విద్యార్థులు వంతుల వారీగా నీళ్లు పోస్తున్నారు. స్వచ్ఛంధంగా కూరగాయలు సాగు చేపట్టడంలో విద్యార్థుల ఆనందం అనంతం.

# దేవాలయాల్లో చోరీలు నివారించండి



రవీంద్రరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

నెల్లూరుజిల్లాలోని పలు దేవాలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలు దొంగల పాలవుతున్నాయని, వీటి నివారణకు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ రవీంద్రరెడ్డికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆదివారం సహాయకమిషనర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయాల్లో విగ్రహాల దొంగతనాలు నిత్యకృత్యాలవుతున్నాయన్నారు. గుప్త నిధుల కోసం పురాతన దేవాలయాలను దొంగలు నాశనం చేస్తూ దొంగలించిన పంచలోహ విగ్రహాలను విదేశాల్లో అమ్మి కోట్ల రూపాయలు దోచుకుంటున్నారన్నారు. హిందువులు ఎంతో పవిత్రంగా భక్తిశ్రద్ధలతో దేవాలయాలను సందర్శిస్తుంటారని, గ్రామాల్లో నడిబొడ్డున వున్న దేవాలయాల్లో కూడా దోపిడి దొంగతనాలు జరుగుతుంటే మీరెందుకు కఠినచర్యలు తీసుకోవడం లేదని సహాయ కమిషనర్‌ను ప్రశ్నించారు. రాత్రి సమయాల్లో గతంలో వాచ్‌మెన్‌లు ఉండేవారని, దేవాదాయశాఖ కార్యనిర్వాహణాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా దొంగతనాలకు పాల్పడుతూ దొంగలు దేవతా విగ్రహాలను దోచుకుంటున్నారన్నారు. దేవాదాయశాఖ, రెవెన్యూ ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, దేవాలయాల పాలకవర్గాలు కలిసి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి యుద్ధ ప్రాతిపదికన దేవాలయాల్లో దొంగతనాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

# సుద్దాల అశోక్‌తేజకు డా॥ నాగభైరవ అవార్డు



ప్రముఖకవి స్వర్గీయ డా॥ నాగభైరవ కోటేశ్వరరావు పేరుమీద ప్రతియేటా ఇస్తున్న ప్రతిష్ఠాత్మక డా॥ నాగభైరవ అవార్డు-2014ను ప్రముఖ సినీగేయరచయిత సుద్దాల అశోక్‌తేజకు ఈ నెల 23వ తేదీ ఆదివారం నెల్లూరు టౌన్‌హాలులో ప్రదానం చేస్తున్నట్లు డా॥ నాగభైరవ అవార్డు కమిటీ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్, చిన్ని నారాయణరావులు తెలిపారు. అవార్డుతో పాటు రూ.10వేలు నగదు, సత్కారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ యేడాది నూతనంగా ప్రవేశపెట్టిన కవితా సంకలనాల పోటీల్లో నాగభైరవ సాహితీ అవార్డును ప్రముఖకవి "రాతిజల" కవితా సంపుటి రచయిత అద్దంకి శ్రీనివాస్ గెలుచుకున్నారని, శ్రీనివాస్‌కు రూ.5వేలు నగదు సత్కారం చేస్తున్నట్లు తెలిపారు. ఆరు నాగభైరవ స్ఫూర్తి అవార్డులను కవులు ఏటూరి నాగేంద్రరావు(నెల్లూరు), కోసూరు రవికుమార్(గుంటూరు), తూమాటి సంజీవరావు(చెన్నై), కోకా విమలకుమారి(విజయవాడ), అద్దేపల్లి జ్యోతి(కాకినాడ), శ్రీరామకవచం సాగర్(ఒంగోలు)లకు అందిస్తున్నామన్నారు. ఈ అవార్డులకు గాను ఒక్కొక్కరికి రూ.1116లు నగదు సత్కారం జరుగుతుందన్నారు. అనంతరం కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



సదరన్ రీజియన్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేస్తున్న యం.వి.యస్.ప్రసాద్ అక్టోబర్ 31వ తేదీన చెన్నైలో పదవీ విరమణ చేశారు. నెల్లూరు వి.ఆర్ కాలేజీ విద్యార్థి అయిన ప్రసాద్ ఆంధ్రప్రభలో సబ్‌ఎడిటర్‌గా పనిచేశారు. 1982లో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌కు ఎంపికై ఫీల్డు పబ్లిసిటీ ఆఫీసర్‌గా నెల్లూరు, కడపలలో పనిచేశారు. అలాగే ఆకాశవాణి, దూరదర్శన్‌లో విజయవాడ హైదరాబాద్ కేంద్రాలలో పనిచేశారు. 2011 నుండి చెన్నైలో పిఐబి డైరెక్టర్‌గా పనిచేస్తూ అబ్దుల్‌కలాం వ్రాసిన పుస్తకాలను తెలుగులోకి అనువదించారు. పదవీ విరమణ చేసిన ప్రసాద్‌ను అక్టోబర్ 31న తమిళనాడు అదనపు డిజి కెఎం రవీంద్రన్ తదితరులు సత్కరించారు.

## 15న ఉక్కుమనిషి విగ్రహావిష్కరణ

కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు వ్యక్తిగత శ్రద్ధ, చొరవతో నెల్లూరు ఏసి నగర్‌లో జిఎన్‌టి రోడ్డుపై ఏర్పాటు చేసిన మాజీఉపప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహావిష్కరణ ఈ నెల 15వ తేదీన జరగనుంది. రాజ్యసభసభ్యుడు, ప్రపంచ క్రికెట్ దిగ్గజం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కూడా ఈ విగ్రహావిష్కరణలో పాలుపంచుకునే అవకాశముంది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుతో పాటు రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ, ఇంకా పలువురు మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

## రత్నం విద్యార్థులకు సోమిరెడ్డి అభినందనలు



ఇటీవల జిల్లా విద్యాశాఖ, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొన్న నెల్లూరులోని డా॥ కిషోర్స్ రత్నం విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన విషయం అందరికీ తెలిసిందే. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులలో "ప్రకృతిపై థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రభావం" పై డా॥ కిషోర్స్ రత్నం విద్యా సంస్థల డైరెక్టర్ డా॥ కృష్ణకిషోర్ సలహామేరకు 'థర్మల్ పవర్‌ప్లాంట్'పై విశేష అనుభవం ఉన్న మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలవడం జరిగింది. వారి బిజీ షెడ్యూల్‌లో కూడా డా॥ కిషోర్స్ రత్నం స్కూలు విద్యార్థులతో మమేకమై దాదాపు 45నిమిషాలు కేటాయించి థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రభావంపై విలువైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు విద్యార్థుల సందేహాలు నివృత్తి చేసి విద్యార్థులలో ప్రాజెక్టుపై ఆత్మస్థైర్యం నింపి రాష్ట్రస్థాయి నుండి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్ రత్నం హైస్కూల్ సరస్వతినగర్ ప్రిన్సిపాల్ శ్రీమతి వసుంధర, ప్రాజెక్టు గైడ్ టీచర్ ఆలీ, ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులు రిషికిరణ్, ప్రణీత్, సునీల్, శ్రీకర, ఫయాజ్ పాల్గొన్నారు.

## నెల్లూరు రెడ్‌క్రాస్‌కు అరుదైన గౌరవం



రక్తనిధి నిర్వహణ, రక్తదాన శిబిరాల ఏర్పాటు, రక్తసేకరణ, రోగులకు రక్తం అందివ్వడంలో నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఈ నెల 9న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఈ విజయానికి కారణమైన రక్తదాతలకు మోటివేటర్లకు రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయినాథ్, టెక్నీషియన్ జీవన్, స్టాఫ్‌నర్సులు కృష్ణవేణి, మంగళగౌరి మోటివేటర్ ఎం.మధుసూదన్‌రావు, శశిధర్, మురళీకృష్ణ, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

## విక్రమ సింహపురి ఇన్‌ఛార్జి వీసిగా వియన్నరావు



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతిగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వియన్నరావు సోమవారం అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఆచార్య జి.రాజారామిరెడ్డి విఎస్‌యు ఉపకులపతిగా మూడు సంవత్సరాల పదవీకాలం ఆదివారంతో ముగియడంతో ప్రభుత్వం కె.వియన్నరావును నియమించింది.

## జనవరిలో ఫ్లెమింగో ఫెస్టివల్

ప్రతి ఏటా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను జనవరిలో నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. మూడురోజుల పాటు ఈ పండుగ నిర్వహిస్తారు. గతంలో కంటే భిన్నంగా ఈసారి వెరైటీగా ఏర్పాట్లు చేయాలనుకుంటున్నారు. ఈసారి పులికాట్‌లో పడవ విహారానికి ప్రాధాన్యత పెంచుతున్నారు. అలాగే సందర్శకులను హెలికాప్టర్‌లో ఎక్కించి చక్కర్లు కొట్టించాలనుకుంటున్నారు.

## వైసిపి కార్మిక నాయకుడిగా మందా బాబ్జీ



నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఆంజనేయుడి వంటి నమ్మినబంటు, ఆయన ఎక్కడ దూకమంటే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా దూకే వీర సైనికుడు మందా బాబ్జీని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్‌యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. బాబ్జీ ప్రస్తుతం పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీలో సభ్యుడిగా వున్నారు. బాబ్జీ మొదటి నుండి కోటంరెడ్డి అనుచరుడే. కోటంరెడ్డి చేసిన అన్ని ప్రజా ఉద్యమాలలోనూ ఆయన వెన్నంటి చురుకుగా పాల్గొన్నాడు. ఆయనతో పాటే వైకాపాలో చేరి ఈరోజు ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడయ్యాడు.

## నీతిమాలిన రాజకీయాలు కట్టిపెట్టు

### - అన్న వివేకాపై తమ్ముడు జయ ఫైర్



తెలుగుదేశంపార్టీతో ఆనం వివేకా చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో దిక్కుతోచని స్థితిలో వివేకా ఏమి మాట్లాడుతున్నాడో తెలియడం లేదని ఇక దగుల్బాజీ రాజకీయాలు కట్టిపెట్టాలని అన్న ఆనం వివేకాపై తమ్ముడు ఆనం జయకుమార్‌రెడ్డి ఫైర్ అయ్యాడు. మంగళవారం నెల్లూరు పొదలకూరురోడ్డు సుజాతమ్మ కాలనీలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ పులిమి శైలజను మేయర్ పదవి నుంచి దింపి తెలుగుదేశంపార్టీలో చిచ్చుపెట్టి ఆ పదవిని ఎవరికి కట్టపెట్టావో ప్రజలందరికి తెలుసన్నారు. అంతేకాదు కార్పొరేషన్‌కు కాపలాదారుడి నంటూ, విశ్వాసపాత్రుడినంటూ... నగర పాలకసంస్థను నిలువునా దోచుకుని అనేక అక్రమాలకు అవినీతికి పాల్పడి కోట్ల రూపాయలు సంపాదించి ఆ డబ్బును, అక్రమాస్తులను ఎవరికి దోచిపెట్టావో కూడా నగర ప్రజలందరికీ తెలుసునన్నారు. తెలుగుదేశంపార్టీలో చేరిన వారంతా దొంగలని అది దొంగల పార్టీ అని వివేకా చేసిన విమర్శలపై స్పందిస్తూ ఇటీవల ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టి, కాంగ్రెస్‌పార్టీకి రాష్ట్రంలో అడ్రస్ లేకుండా చేసిన విషయం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న చంద్రబాబునాయుడిపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ప్రజలు తరిమికొడతారని వివేకాపై మండిపడ్డారు. మొన్నటి వరకు చంద్రబాబు ధీటైన నాయకుడు, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం అంటూ పొగిడిన నీ నోరు అసలు నోరేనా అని ప్రశ్నించారు. టిడిపిలో చిచ్చుపెట్టేందుకు ఆనం వివేకా కుట్ర పన్నుతున్నారని, పార్టీ సీనియర్ నాయకులకు, మంత్రి నారాయణకు మధ్య తగాదాలు పెట్టేందుకు కొత్త వ్యూహం రచిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వద్దే వెంకటేశ్వర్లునాయుడు, ఆర్.శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), గార్లపాటి జయకుమార్, కొర్లగుంట బాబునాయుడు, వెంకటేశ్వర్లుయాదవ్, షఫి, ఖాన్, యూసఫ్, బి.ఎల్.ఆచారి, నాగేశ్వరరావు, సదాశివయ్య ఆచారి, మహ్మద్, ప్రకాష్, గౌస్, కోటి, నాగేశ్వరరావు, రాఘవులు, హరి తదితరులు పాల్గొన్నారు.




# 'ప్రభా'తం

ఎక్కడికి పోతున్నాం..మనం?..ఎటు పోతున్నాం మనం?..చీకట్లోంచి వెలుగులోకి పోతున్నామా?..లేక, ఇంకా కటికచీకటి దారుల్లోనే అలమటిస్తున్నామా?.. ఇదేనా మన ప్రగతి చరిత?. ఏమవుతోంది మన బాలల భవిత?..అందరూ ఆలోచించాల్సిన విషయమిది. మన భావిభారత పౌరులకు వెలుగుబాటలు చూపాల్సిన సమయమిది.

దేశానికి స్వాతంత్య్రం వచ్చి అక్షరాలా అరవై ఏడు సంవత్సరాలు దాటుతున్నా, ఇంకా మనం బాలల భవితకు సంబంధించిన అనేక విషయాల్లో బాలారిష్టాలు దాటలేకపోతున్నాం. ఆడుకుంటూ, పాడుకుంటూ..హాయిగా చదువుల తల్లి ఒడిలో ఎదగాల్సిన ఎంతోమంది చిన్నారులు..తినడానికి సరైన తిండి లేక, ఆడుకోవడానికి శక్తి లేక, దీనంగా.. బలహీనంగా, అత్యంత దయనీయంగా బతుకుతుండడం బాధాకరం. శారీరకంగా, మానసికంగా ధీటుగా.. దృఢంగా ఎదుగుతూ..శక్తియుక్తుల్లో, ప్రజ్ఞాపాటవాల్లో తమకు సాటే లేదని అనిపిస్తూ, అందరూ గర్వించేవిధంగా రాణించాల్సిన బాలలు అనేకమంది నేటికీ కష్టాల కడగండ్లలో కొట్టుమిట్టాడుతూనే వున్నారు.. కన్నీటి సుడిగుండాల్లో కొట్టుకుపోతూనే వున్నారు.

రానురాను మనదేశంలో బాలల అభ్యున్నతి అందని ద్రాక్షపండైపోయింది. బాలల పురోగతి అన్నది నేతిబీరకాయ చందంగా మారిపోయింది. మాటల్లో తప్ప చేతల్లో బాలల పథకాలు ఆశించినస్థాయిలో పురోగతి సాధించనే లేదు. చెప్పుకునేందుకు రకరకాల కారణాలెన్నయినా వుండవచ్చు కానీ, బాలల ప్రగతి బాగా వెనుకబడిపోయింది. అసలు బాలల భవితకు భరోసా అన్నది లేకుండా పోయింది. దారిద్ర్యపు పెనుబెబ్బులి కోరలకు చిక్కిన ఎన్నో కుటుంబాల్లో తినడానికి సరైన తిండి లేక అటు తల్లులు, ఇటు బిడ్డలు పడే అవస్థలు వర్ణనాతీతం. సరైన పౌష్టికాహారం లేకపోవడంతో, వ్యాధినిరోధక శక్తి సన్నగిల్లిపోయి, శరీరాలు బక్కచిక్కిపోతున్నాయి. పుట్టడమే వ్యాధుల బాధలు అంటిపెట్టుకుని వస్తున్నాయి. రకరకాల అంటువ్యాధులు అంటుగట్టుకుని వస్తున్నాయి. పుట్టడమే ఇలా నరకయాతనగా వుంటే.. ఇక ఇన్ని అవస్థలతో బతకడం ఎంత ఘోరంగా వుంటుందో ఆలోచించండి!...

ప్రపంచంలో అత్యధిక బాలలున్న దేశం మనదే. అయితే, అదేమి దురదృష్టమో కానీ, సరైన పోషకాహారం లేకపోవడం, తదితర అనారోగ్య కారణాల వల్ల సంభవించే శిశు మరణాలూ మనదేశంలోనే ఎక్కువ. పౌష్టికాహారం లోపం మన బాలలకు ఒక శాపం. సక్రమమైన ఆహారం అందక దేశంలో ప్రతి ఏటా 13లక్షల మందికి పైగానే పిల్లలు మృత్యుఒడికి చేరుకుంటున్నారంటే పరిస్థితి ఎంత హృదయ విదారకంగా వుందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచ ఆరోగ్యసంస్థ సర్వే వివరాల ప్రకారం, మన దేశంలో అయిదేళ్ళలోపు వయసున్న బాలలు రకరకాల వ్యాధులకు గురైనందువల్లనో, సరైన వైద్యసదుపాయాలు లోపించినందువల్లనో మొత్తమ్మీద ఏదైతేనేం..అయిదేళ్ళ లోపు బాలలు, గత అయిదేళ్ళలో దాదాపు 60 లక్షల మందికి పైగానే మృతి చెందినట్లు అంచనా. దీనినిబట్టి చూస్తే దేశంలో బాలల స్థితిగతులు ఎంత దయనీయంగా వున్నాయో తేటతెల్లమవుతుంది. దేశానికి స్వాతంత్య్రం వచ్చి అక్షరాలా అరవై ఏడు సంవత్సరాలు దాటినా, ఇంకా బాలలకు ఈ దురవస్థలు తప్పడం లేదు. దేశంలో లక్షలాదిమంది బాలలు నేటికీ సరైన పౌష్టికాహారం లేక, సక్రమమైన వైద్యసదుపాయాలు లేక, చదువుకునేందుకు తగ్గ స్తోమత లేక.. బతుకంత బాధగా.. బాల్యమంతా వ్యధగా.. ఆవేదనగా బతుకులీడుస్తున్నారు. బక్కచిక్కిన దేహాలతో.. బీదరికపు నవ్వులతో.. కన్నీరింకిన కన్నులతో రేపటి వెలుగుల కోసం ఆశగా - ఆత్రుతగా ఎదురుచూస్తునే వున్నారు.

బాలల భవితకు అన్నీ శాపాలే..అన్నట్లుగా, పేదరికం ఒకవైపు, అనారోగ్యాలు మరోవైపు..బాలల సంక్షేమాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోని నిర్లిప్త వైఖరి ఇంకోవైపు. అంతేకాదు, ఆసుపత్రుల్లో సరైన వైద్యసదుపాయాలు లేకపోవడం, వైద్యుల కొరత, ఆసుపత్రిలో పడకల కొరత, అవసరమైన పరికరాల కొరత, వసతుల కొరత..మందుల కొరత..ఇలా అన్ని రకాల కొరతలతో బాలల సంక్షేమం కాస్తా అడుగంటిపోయింది. బాలల అభ్యున్నతి..అభ్యుదయం అనే మాటలు పదాడంబరం కోసం మిగిలిపోయాయే తప్ప, ప్రత్యేకించి బాలలకు ఒరిగిందేమీ లేదు.. ఇన్నాళ్ళూ.. ఇన్నేళ్లూ పురోగతి పెద్దగా జరిగిందీ లేదు.

ఇకనైనా ఈ దుస్థితి మారుతుందని ఆశిద్దాం. బాలల సంక్షేమానికి కట్టుబడి పనిచేసేందుకు ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం సమాయత్తం కానుండడం ఒక శుభ పరిణామం. బాలల సంక్షేమాన్ని కాంక్షిస్తూ, ఇటీవల ఒక కార్యక్రమంలో ఆయన అన్న ఒక్కమాట చాలు.. బాలలపట్ల ఆయనకున్న అపారమైన ప్రేమాభిమానాలను చాటడానికి. 'ఏ దేశానికైనా బాలలే భాగ్యవిధాతలు.. వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటేనే దేశానికి ధీమా''.. అక్షరాలా ఈ మాటలే..దయనీయ స్థితిలో వున్న నేటి బాలలకు రేపటి వెలుగురేఖలు కానున్నాయని ఆశించవచ్చు.

అయితే, భావి భారతానికి వారధులు.. సారధులూ అయిన బాలలు అన్ని రకాల దురవస్థల నుంచి బయటపడేందుకు, బాలలు తరగని చిరునవ్వులతో కళకళలాడుతూ వుండేందుకు... ఏ ఒక్కరో ఇద్దరో కాదు, ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలి. బాలలెవరూ బాధలతో కంటతడిపెట్టని మంచిరోజులు రావాలి...ఇదే అందరి ఆకాంక్ష కావాలి.

దేశవ్యాప్తంగా బాలలకు అవసరమైన వసతుల కల్పనకు, వారి భవితకు బంగారుబాటలు వేసేందుకు ప్రభుత్వాలు తక్షణ ప్రణాళికలతో సమాయత్తమై, బాలల అభ్యున్నతికి ఇక ఏ లోటూ లేనంతగా నిధులను సమకూర్చాలి. పథకాలు ప్రకటించడమే కాక, వాటిని పటిష్టంగా అమలుచేసేందుకు గట్టి చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా, బాలలకు పౌష్టికాహారాన్ని సమకూర్చడంలోనూ, మాతా శిశుమరణాలను పూర్తిగా నివారించడంలోనూ, ఆసుపత్రులను పూర్తిస్థాయిలో ఆధునీకరించి బాలలకు అవసరమైన సకల ఆరోగ్య సదుపాయాలను కల్పించడంలోనూ, బాలలకు విద్యావసతుల కల్పనలోనూ ప్రత్యేక కృషి చేయాలి. దేశవ్యాప్తంగా తిరిగి బాలల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలి. మన బాలలు ప్రపంచానికే ఆదర్శవంతం కావాలి. ప్రధాని మోడీ సారధ్యంలో..ఆ మంచిరోజులు త్వరలోనే వస్తాయని ఆశిద్దాం!..

## రేపటి వెలుగురేఖలు



భావి భారతానికి వారధులు.. సారధులూ అయిన బాలలు అన్ని రకాల దురవస్థల నుంచి బయట పడేందుకు, బాలలు తరగని చిరునవ్వులతో కళకళలాడుతూ వుండేందుకు... ఏ ఒక్కరో ఇద్దరో కాదు, ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలి. బాలలెవరూ బాధలతో కంటతడిపెట్టని మంచిరోజులు రావాలి...ఇదే అందరి ఆకాంక్ష కావాలి.

- కార్పొరేషన్ వద్ద టిడిపి నేతల ధర్నా

# కమిషనర్‌తో కార్పొరేటర్ల కయ్యం



నెల్లూరు నగరపాలక సంస్థలో ఈ నెల 19వ తేదీ జరగనున్న స్టాండింగ్ కమిటి ఎన్నికలకు సంబంధించిన సమాచారం అందలేదని 21వ డివిజన్ కార్పొరేటర్ నూనె మల్లిఖార్జునయాదవ్, కమిషనర్ చక్రధర్‌బాబును ప్రశ్నించారు. మంగళవారం కమిషనర్ ఛాంబర్‌లో మల్లిఖార్జునయాదవ్ ఎన్నికలు వాయిదా వేయాలని చెప్పడంతో కమిషనర్ ఈ ఎన్నికకు సంబంధించి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. దీంతో మల్లిఖార్జునయాదవ్ మేనేజర్‌కు చెబితే సరిపోదని తనకు సమాచారం లేదని చెప్పడంతో వివాదం రేగింది. దీంతో మల్లిఖార్జున యాదవ్ తనను కమిషనర్ ప్రజాప్రతినిధిగా గౌరవించలేదని ఛాంబర్ బయటకు వచ్చి కార్పొరేటర్లు వహీదా, ఊటుకూరు మస్తా నమ్మలతో కలిసి ధర్నా చేపట్టారు. మిగతా టిడిపి నాయకులు కూడా ధర్నాకు దిగారు. సమాచారం తెలుసుకున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, చాట్ల నరసింహారావు తదితరులు చేరుకుని విషయం తెలుసుకుని, మల్లిఖార్జునయాదవ్‌ను ధర్నా విరమించాలని కోరారు.

నూనె ససేమిరా అనడంతో కోటంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకమాండ్ చెప్పిన మాట వినవా అంటూ మండి పడ్డారు. మంత్రి నారాయణకు జరిగిన సంఘటన తెలియ దంతో సమస్యను పెద్దది చేయకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సంఘటనకు ముగింపు పలకాలని టిడిపి నాయకులు కార్పొరేటర్ నూనె మల్లిఖార్జునయాదవ్‌తో కలిసి కమిషనర్‌తో మాట్లాడారు. దీంతో సమస్య సద్దుమణిగింది. మల్లిఖార్జునయాదవ్ ధర్నా, నిరసన విరమించారు.

# జర్నలిస్టుల నిరసన

నెల్లూరులో ఎక్స్‌ప్రెస్ టి.వి. కెమెరామెన్ ఆరీఫ్ పై అక్రమ కేసు నమోదుకు నిరసనగా జర్నలిస్టులు 8వ తేదీ ఆందోళన చేపట్టారు. నెల్లూరు విఆర్‌సి సెంటరులో జర్నలిస్టులు అక్రమ కేసు ఎత్తివేయాలంటూ నిరసనకు దిగారు. నెల్లూరులో గత కొన్ని నెలలుగా జర్నలిస్టులపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా జర్నలిస్టులు విఆర్‌సి సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించారు.

రొట్టెల పెండుగ సందర్భంగా కెవిఆర్ పెట్రోల్ బంకు వద్ద ట్రాఫిక్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ప్రకాశం జిల్లా అర్ధవీడు ఎస్సై నాగమల్లేశ్వరరావు ఎక్స్‌ప్రెస్ కెమెరామెన్‌పై దాడి చేశాడు. కెమెరామెన్‌కు గాయాలు కాగా ఆసుపత్రికి వెళ్లి ట్రీట్‌మెంట్ చేసుకున్నాడు. ఎస్సై దాడి చేశాడని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాని పోలీసులు బాధితుడు ఆరీఫ్‌పై నాలుగో నగర పోలీసు స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న ఎస్సైపై అనుచితంగా ప్రవర్తించాడని విధులకు ఆటంకం కల్గించాడని కేసు నమోదు చేసి నాన్‌బెయిలబుల్ సెక్షన్లు విధించారు. ఈ సంఘటన జర్నలిస్టులకు బాధ కలిగించింది. దాడిలో గాయపడిన ఆరీఫ్‌పై అక్రమ కేసు నమోదు చేయడంపై జర్నలిస్టులు నిరసన తెలిపి కలెక్టర్ శ్రీకాంత్, ఎస్పీ సెంథిల్‌కుమార్‌కు వినతిపత్రాలు అందించారు. ఆరీఫ్‌పై అక్రమకేసు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. తప్పక విచారణ జరిపించి న్యాయం చేస్తామని కలెక్టర్ తెలిపారు. డిఎస్‌పి స్థాయి అధికారిచే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు విజయ్, షఫీ, మురళి, మస్తాన్‌రెడ్డి, ఖాజా రహంతుల్లా, రాజేష్,మునీంద్ర, అమర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బాగుపడ్డ గొలగమూడి

గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమం రిసీవర్ బాలసుబ్రహ్మణ్యం అద్భుతవ్యక్తి. గొలగమూడిని చిన్నతిరుమలగా చేస్తున్నారు. బీడుపడిన ఆశ్రమానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చారు. సర్వరోగులకు ఆశ్రమాన్ని ఆనందనిలయంగా మార్చారు. దివ్య మందిరం రహదారులు, శుభ్రమైన భోజనం, చక్కటి పరిసరాలు, అతిథిగృహాలు, 25కోట్ల బ్యాంకు అకౌంట్‌తో వెంకయ్యస్వామి ఆశ్రమం అలరారుతోంది.

*వాస్తు రామచంద్ర, నెల్లూరు.*

## కార్పొరేట్ కంపెనీ!

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం నడుస్తున్నట్లుగా లేదు. ఈస్టిండియా కంపెనీ ఈ రాష్ట్రాన్ని ఏలుతున్నట్లుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వంలో వ్యాపార వేత్తలే కీలకపాత్ర పోషిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును వారే నడిపిస్తున్నారు. కార్పొరేట్ వ్యవహారాలకనుగుణంగానే రాష్ట్రంలో పరిపాలన సాగుతుండడం శోచనీయం.

*వి. జ్యోతి, కావలి.*




## సచిన్‌కు అభినందనలు

తన రాష్ట్రం కాదు, తన జిల్లా కాదు. తన ఊరు కాదు... అయినా కూడా ఇంత దూరం వచ్చి నెల్లూరుజిల్లాలో పుట్టంరాజు కండ్రిగ అనే గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నందుకు క్రికెట్ హీరో సచిన్ టెండూల్కర్‌కు అభినందనలు. ప్రతి స్టార్ కూడా సచిన్‌ను ఆదర్శంగా తీసుకుని ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తే అతికొద్ది కాలానికే భారతదేశ స్వరూపమే మారిపోతుంది.

*చల్లా మాలకొండయ్య, ఆత్మకూరు.*

## వాస్తవదృష్టితో చూడండి

నెల్లూరు నగరంలో ట్రంకురోడ్డును వెడల్పు చేయాలనుకోవడం మంచిదే! అయితే చిన్న, సన్న వ్యాపారులకు నష్టం కలుగని రీతిలో రోడ్ల విస్తరణ చేపడితే బాగుంటుంది. ట్రంకురోడ్డు స్థలంలో వెంబడి రెండు నుండి పది అంకణాల స్థలాలలో షాపులు పెట్టి జీవనం సాగిస్తున్న వాళ్లున్నారు. అలాంటి వారిని రోడ్డున పడేయకుండా రోడ్డు విస్తరణ చేపట్టాల్సివుంది.

*జీనిగల సుధాకర్, నెల్లూరు.*

# ఎవరి మాటా వినరు... సీతయ్యలు






**తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిందన్న ఆనందం జిల్లాలో ఆ పార్టీ నాయకులలో పెద్దగా కనిపించడం లేదు. చాలా మందైతే మా తెలుగుదేశం ప్రభుత్వంలో కంటే గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మాకు బాగుండిందనే ఫీలింగ్‌తో ఉన్నారు. దీనికి కారణం రాజకీయ పైరవీలకు పనులు కాకపోతుండడమే. అధికారుల వద్ద కాంగ్రెస్ నేతలకైనా, వైకాపా కార్యకర్తలకైనా టీడీపీ లీడర్లకైనా ఒకే ట్రీట్‌మెంట్ ఉంటుంది. దీంతో మునుపటికి ఇప్పటికి తమకు పెద్ద తేడా ఏమీ కనిపించడం లేదని 'దేశం' తమ్ముళ్ళు వాపోతున్నారు.**

ఏ పార్టీ అధికారంలోకి వచ్చిందంటే స్వతహాగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోతుంటారు. కలెక్టర్ కార్యాలయంలో వాళ్లే ఉంటారు. ఎస్పీ కార్యాలయంలో వాళ్లే పైరవీలు చేస్తుంటారు. ఆర్ అండ్ బి కార్యాలయంలో కూర్చుని వాళ్లే కాంట్రాక్ట్ పనులు కేటాయిస్తుంటారు. మున్సిపల్ కార్యాలయంలో వారి హవానే సాగుతుంటుంది. ఇలా అది ఇది అని తేడాలేకుండా అన్ని ప్రభుత్వ వ్యవస్థలపై అధికార పార్టీ ముద్ర కనిపిస్తుంటుంది. పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటే జిల్లాలో ఆనం సోదరుల హవా నడిచింది. కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు అనుకున్న పనులు ఆగమేఘాల మీద జరుగుతుండేవి. గత పదేళ్లకాలంలో కాంగ్రెస్‌వాళ్ల దందాను చూసిన తెలుగు తమ్ముళ్లు తమ పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి తమ ఆటలు కూడా అట్లాగే సాగుతాయని ఆశించారు. కాని తీరా చూస్తే జిల్లాలో సీన్ రివర్సయ్యింది.

కాంగ్రెస్ హయాంలో ఎస్పీలైనా, కమిషనర్లైనా ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు స్టాండ్ అంటే నిలుచోవడం, సిట్‌డౌన్ అంటే కూర్చోవడం చేసే అధికారులొచ్చారు. కాని ఇప్పుడు చూస్తే... తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలను సిట్, స్టాండ్ అంటూ శాసించే అధికారులు వచ్చారు. వీళ్లు అధికారపార్టీ నాయకులకు కొరకరాని కొయ్యలుగా మారారు. జిల్లా కలెక్టర్ ఉంటే ఎవరికీ విధేయుడు కాదు. తెలుగుదేశం బ్రాండ్ లేదు. నిబంధనల ప్రకారం పోతున్నాడు. అడ్డదిడ్డంగా ఏ పనీ చేయడు. జడ్పీ ఛైర్మెన్ ఎన్నిక సమయంలోనే అధికారపార్టీ ఎమ్మెల్యేలతో ఆయనకు పేచీ వచ్చింది. ఇక జాయింట్ కలెక్టర్ రేఖారాణి ఉంటే ఏ ఒక్కరినీ లెక్కచేయదు. ఆమె అనుకున్నదే చేస్తుంది. అధికారపార్టీ నాయకుల పైరవీలు పెద్దగా సాగవు.

ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఎస్పీ సెంథిల్‌కుమార్ గురించి. సాధారణంగా అధికారంలో వున్న పార్టీ వాళ్లు తమ ప్రతాపాన్ని పోలీసుశాఖ ద్వారానే చూపించుకుంటుంటారు. గ్రామాలలో ప్రత్యర్థులపై దొంగకేసులు పెట్టించడం, రాజకీయంగా వారిని సతాయించడం, తమ పార్టీ కార్యకర్తలు తప్పుచేసినా కేసులు లేకుండా చేసుకోవడం వంటివి చేస్తుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలావరకు ఇటువంటివే జరిగాయి. కాని ఇప్పుడు అలాంటివి జరగడానికి ఆస్కారం లేకుండా పోయింది. ఎస్పీ సెంథిల్‌కుమార్ దెబ్బకు అక్రమకేసులు పెట్టడానికి ఎస్ఐలు, సిఐలు ముందుకు రావడం లేదు. అధికారపార్టీ అయినా, ప్రతిపక్ష పార్టీ అయినా నాకొకటే అన్నట్లుగా ఎస్పీ పనితీరు ఉంది. పోలీసు శాఖలో తెలుగుతమ్ముళ్ళకు స్పెషల్‌గా పనులేవీ జరగడం లేదు. దీంతో ఇటీవల తెలుగుదేశం నాయకులు ఎస్పీని బదిలీ చేయాలంటూ బహిరంగంగానే వ్యాఖ్యానించగా, మూడేళ్ల దాకా అలాంటి ఆలోచనలు పెట్టుకోవద్దని మంత్రి నారాయణే తేల్చి చెప్పడంతో పాపం తెలుగుబ్రదర్స్ నీరుగారిపోయారు.

నెల్లూరు నగరపాలక సంస్థలో అధికారపార్టీ పరిస్థితైతే మరీ విషాదం. తెలుగుదేశంలో చేరి నెల్లూరునంతా దున్నేద్దామని మేయర్ అజీజ్ వైకాపా నుండి తెలుగుదేశంలోకి జంప్ చేశారు. ఈయన ఇటు వచ్చాక కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి చక్రధర్‌బాబును నియమించారు. ఇంకేముంది సీన్ రివర్స్... కార్పొరేషన్‌లో ఆయన పవర్ సెంటర్ అయ్యాడు. అక్రమాలకు చెక్ పడింది. గట్టిగా పనిచేస్తున్నాడు. కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాడు. మేయర్‌కు నగర ప్రజలతో స్నేహం, సంబంధబంధాలుంటాయి. కొన్ని పనులు రూల్స్‌ను అతిక్రమించి చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు కార్పొరేషన్‌లో అవేవీ జరగడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా చేయడానికి కార్పొరేషన్ సిబ్బంది భయపడుతున్నారు. మేయర్ కంటే కమిషనర్ శక్తివంతంగా మారాడు. దీంతో తనకు తెలియకుండానే కార్పొరేషన్‌లో నిర్ణయాలు జరిగిపోతున్నాయంటూ మేయర్ అజీజ్ మంత్రి నారాయణ వద్ద వాపోయాడు. నెల్లూరు నగరాన్ని దారిలో పెట్టడానికే ఐఏఎస్ కమిషనర్‌ను వేసామని, కొంతకాలం గుండెను గుండ్రాయిని చేసుకుని ఓపిక పడితే తర్వాత అదే అలవాటవుతుందని మంత్రి నారాయణ అజీజ్‌కు ధైర్యం చెప్పారు.

మొత్తానికి జిల్లాకు ఆఫీసర్లు బాగానే సెట్ అయ్యారు. కాకపోతే తెలుగు తమ్ముళ్ల మైండ్‌సెట్‌కు వారు సెట్ కావడం లేదు.

# స్టాండింగ్‌లో ఎవరిది పైచేయి!

**నెల్లూరునగర పాలకసంస్థలో ఇంతకుముందు అధికార పక్షానికి, ప్రతిపక్షానికి పడేది వదు. కాని ఇప్పుడు అధికార పక్షంలోనే ప్రతిపక్షం ఏర్పడింది. దీంతో వాళ్లలోవాళ్లే తన్నుకుంటూ ప్రధాన ప్రతిపక్షమైన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ సభ్యులకు పనిలేకుండా చేస్తున్నారు.**

నెల్లూరు కార్పొరేషన్‌లో ప్రజలు తెలుగుదేశంపార్టీకి ప్రతిపక్షం స్థానాన్ని అప్పగించినా మేయర్ అజీజ్ పార్టీ మారడంతో అధికారపక్షంలోకి వచ్చింది. అయితే దీనివల్ల మేయర్ అజీజ్‌కు ఒకటికి రెండు ప్రతిపక్షాలు ఏర్పడ్డాయి. వైకాపా ప్రధాన ప్రతిపక్షమైతే, తెలుగుదేశం ఒరిజినల్ కార్పొరేటర్లు రెండో ప్రతిపక్షంగా ఉన్నారు. త్వరలో జరగబోతున్న స్టాండింగ్ కమిటి ఎన్నికలు తెలుగుదేశం కార్పొరేటర్ల మధ్య వర్గవిభేదాలకు మరోసారి ఆజ్యం పోస్తున్నాయి.

నగరపాలక సంస్థలో ఐదు స్టాండింగ్ కమిటీలకు ఛైర్మెన్‌లను నియమించాల్సివుంది. కార్పొరేషన్ వ్యవహారాలలో మేయర్ తర్వాత స్టాండింగ్ కమిటీల ఛైర్మెన్‌లే కీలకపాత్ర పోషిస్తుంటారు. 10లక్షల విలువ దాటిన పనులన్నింటిని కూడా ఈ కమిటీల ఛైర్మన్‌ల ఆమోదం కావాలి. దీంతో ఈ పదవులకు తెగ డిమాండ్ ఏర్పడింది. ఈ ఐదు పదవుల్లో మూడింటిని తెలుగుదేశం ఒరిజినల్ కార్పొరేటర్లు, రెండు అజీజ్‌తో చేరిన కార్పొరేటర్లకు ఇవ్వాలనే ప్రతిపాదన పెట్టుకున్నారు. అయితే ఒరిజినల్ కార్పొరేటర్లు అజీజ్ వర్గానికి ఒకటే ఇస్తామని పేచీ పెట్టడంతో పీఠముడిపడింది.

ఇదే అజీజ్ వైకాపాలోనే ఉండుంటే ఐదు స్టాండింగ్ కమిటీ ఛైర్మెన్ పదవులు ఆయనే నిర్ణయించే వాళ్లు. ఇప్పుడు తెలుగుదేశంలోకి వచ్చి ఆ పవర్ లేకుండా చేసుకున్నాడు. పెనం మీద నుండి పొయ్యిలో పడడమంటే ఇదే!

# ఆత్మకూరు 'దేశం'కు చేవ

జిల్లాలోకల్లా తెలుగుదేశంపార్టీ చాలా బలహీనంగా ఉన్న నియోజకవర్గాలలో ఆత్మకూరు మొదటిస్థానంలో వుంది. గతంలో ఇక్కడ తెలుగుదేశంకు బలమైన నాయకుడిగా వున్న కొమ్మిలక్ష్మయ్య నాయుడు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాక ఇక్కడ పార్టీలో నాయకత్వ లోటు ఏర్పడింది. మొన్న ఎన్నికల ముందు కూడా ఇక్కడ బలమైన నాయకులెవరూ పార్టీలోకి రాలేదు. దీంతో అప్పటివరకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న గూటూరు కన్నబాబునే పార్టీ అభ్యర్థిగా నిర్ణయించాల్సి వచ్చింది. మొన్నటి ఎన్నికల్లో ఆనం రామనారాయణరెడ్డి అభ్యర్థిగా గట్టోడైనప్పటికి కాంగ్రెస్ అంటే ప్రజలు శత్రువుగా భావించడం, మరో పక్క తెలుగుదేశం అభ్యర్థిగా ఉన్న గూటూరు కన్నబాబు సరిపోకపోవడంతో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి గౌతంరెడ్డి 33వేల ఓట్ల మెజార్టీతో గెలిచాడు.



ఆత్మకూరులో అంత బలహీనంగా ఉన్న పార్టీకి ఇప్పుడు కొత్త శక్తి, నూతనోత్సాహం వచ్చినట్లయ్యింది. దానికి కారణం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలుగుదేశంపార్టీలో చేరడమే. అనంతసాగరం మండలం లింగంగుంట గ్రామానికి చెందిన ధనుంజయరెడ్డి ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో కాంగ్రెస్‌ను వదిలి తెలుగుదేశంలో చేరడం జరిగింది. మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఈయన ముఖ్యఅనుచరుడు. మొన్నటి ఎన్నికల్లో ఆనం ఎలక్షన్ చేయకుండా వదిలేసినా ధనుంజయరెడ్డే ఆయన తరపున కొంత కష్టపడ్డాడు. రెండేళ్ల క్రితం జరిగిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎన్నికల్లో ధనుంజయరెడ్డి ఆనం సహకారంతోనే బ్యాంకు ఛైర్మెన్ అయ్యారు. రాష్ట్ర విభజనతో రాష్ట్రంలో కాంగ్రెస్ ఎత్తిపోయింది. కాంగ్రెస్‌లో ఉండడం దండగనుకున్న నాయకులందరూ ఆ పార్టీని వదిలి తెలుగుదేశం, వైకాపాలలో చేరిపోయారు. కాని ఆనం వాళ్లు కాంగ్రెస్‌ను వదల్లేదు. దాంతో ధనుంజయరెడ్డి కూడా ఇంతకాలం ఆనంను వదిలి రాలేకపోయారు. ఆయన తెలుగుదేశంలో చేరాలన్న నిర్ణయాన్ని ఎన్నికలకు ముందే తీసుకుని ఉంటే ఆత్మకూరు రాజకీయాలు ఇంకో విధంగా ఉండేవి. నెల్లూరు లోక్‌సభ టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆరోజు ధనుంజయరెడ్డిని తెలుగుదేశంలోకి తీసుకురావడానికి శతవిధాలా ప్రయత్నించారు. అయితే ఆరోజు ఆనంను వదిలి ఆయన రాలేకపోయాడు. వచ్చివుంటే ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆయనే అయ్యుండేవాడు. ఆయన పోటీ చేసి వుంటే ఆత్మకూరు అసెంబ్లీ ఫలితంతో పాటు నెల్లూరు లోక్‌సభ అభ్యర్థుల జాతకం ఇంకో విధంగా ఉండేది.

ఆలస్యంగానైనా మెట్టుకూరు ధనుంజయరెడ్డి రాకతో ఆత్మకూరు తెలుగుదేశంకు ఊపు ఉత్సాహం వచ్చింది. ఆత్మకూరులో పార్టీ కేడర్‌కు ఒక గట్టి లీడర్ దొరికినట్లయ్యింది.

# కాంగ్రెస్‌ను వదిలేసిన వాకాటి



**కాంగ్రెస్ శాసనమండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డి ఆ పార్టీకి దూరమయ్యారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌తో ఉన్న అనుబంధాన్ని తెంచేసుకున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఆయన తెలుగుదేశంపార్టీలో చేరిపోయారు. వాకాటిని తెలుగుదేశంలోకి తీసుకురావడంలో మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కీలకపాత్ర పోషించినట్లుగా తెలుస్తుంది.**

రాష్ట్ర విభజన నేపథ్యంలోనే వాకాటి నారాయణరెడ్డి కాంగ్రెస్‌పార్టీని విడిచిపెట్టి కిరణ్‌కుమార్‌రెడ్డి పెట్టే పార్టీలో చేరాలనే ఆలోచన చేశారు. కిరణ్ పార్టీకి అంత సీన్ లేదని తెలిసి కాంగ్రెస్‌లోనే ఉండిపోయారు. ఎన్నికల తర్వాత తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. వాకాటి ఆ పార్టీకి కొంచెం దగ్గరయ్యారు. శాసనమండలి ఛైర్మెన్ ఎన్నికలో కూడా ఆయన తెలుగుదేశంకే అనుకూలంగా వ్యవహరించారు. ఈమధ్య కాలంలో చంద్రబాబుతో సన్నిహితంగా వుంటూ ప్రభుత్వం చేపడుతున్న జన్మభూమి కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. దీనినిబట్టి చూస్తుంటే కాంగ్రెస్‌తో తెగదెంపులు అయినట్లేనని గతంలోనే అనుమానాలొచ్చాయి. ఇప్పుడు ఆ అనుమానం నిజమైంది. కాంగ్రెస్‌తో వాకాటిది సుధీర్ఘకాల బంధం. కాంగ్రెస్ వాదిగానే కాదు నేదురుమల్లి ముఖ్యఅనుచరుడుగా కూడా ఆయనపై ముద్ర వుంది. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇంతకాలం కాంగ్రెస్ పార్టీని నెట్టుకుంటూ వచ్చింది వాకాటే! పార్టీలో పలు పదవులను సమర్ధవంతంగా నిర్వహించిన వాకాటి మొన్నటి ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి డిపాజిట్ కోల్పోయారు. రాష్ట్రంలోనే కాంగ్రెస్‌పార్టీ ఉనికిని కోల్పోతున్న తరుణంలో ఇక పార్టీలో ఉండడం దండగనుకుంటున్న ఆయన తెలుగుదేశంలో అధికారికంగా చేరారు. కాంగ్రెస్‌తో వున్న బంధాలను, బంధుత్వాన్ని తెంచేసుకున్నారు.













# ఆనందోత్సవం...

# బాలల సంబరోత్సవం





































# పేదలకు సేవచేస్తే గుర్తింపు ఉంటుంది

- ఆర్డీవో రవీందర్



ఆర్డీవో కె.శ్రీనివాసరావును సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

సంక్షేమ పథకాలు, సేవలను రెవెన్యూ ద్వారా సక్రమంగా అందించగలిగితే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని ఆర్డీవో రవీందర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎంపిడివో కార్యాలయంలో ఆదివారం బదిలీపై వెళ్లిన ఆర్డీవో కె.శ్రీనివాసరావు అభినందన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అత్యంత దగ్గరగా సేవలందించేది రెవెన్యూశాఖని, ఒక్కరోజు అధికారులు కార్యాలయాలకు రాకపోతే ప్రజలు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావని, ఇది కేవలం రెవెన్యూశాఖ సిబ్బందికే తెలుస్తుందని తెలిపారు. దీన్ని గుర్తించి అన్ని వేళల్లో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి పనిని నిబద్ధతతో నిర్వర్తించాలని కోరారు. గూడూరు డిఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ అధికార ప్రాంతాలు మారినా సేవ మాత్రం గుర్తుండిపోతుందన్నారు. ప్రతిఒక్కరూ తమ పనిని సక్రమంగా చేస్తే విలువ దానంతటదే వస్తుందన్నారు. ఆర్డీవో కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో అత్యంత సమస్యాత్మక, కీలకమైన చిల్లకూరు మండలంలో ఉన్న సమస్యలు జిల్లాలో ఎక్కడాలేవని, అదేవిధంగా గూడూరు, కోట, చిట్టమూరు తదితర మండలాల్లో ప్రభుత్వ భూములను సంరక్షించి హద్దులు ఏర్పాటు చేయడంలో తహశీల్దార్లు చేసిన చర్యలపై అభినందించారు. అనంతరం వివిధ మండలాల తహశీల్దార్లు తదితరులు మాట్లాడారు. ఆర్డీవో కె.శ్రీనివాసరావును రెవెన్యూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, పలువురు అభిమానులు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో బషీర్, గూడూరు తహశీల్దార్ వెంకటనారాయణమ్మ, శ్రీకాంత్ కేదార్‌నాథ్, వెంకట సునీల్, లీలారాణి, ఈశ్వరమ్మ, సీతారామయ్య, పలువురు అధికారులు ఎంపిడీవో నిర్మలాదేవి, రెవెన్యూ అసోసియేషన్ రమణయ్య, నాగార్జునరెడ్డి, జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# తెలుగుదేశంపార్టీ కార్యకర్తల సభ్యత్వ నమోదు



కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశంపార్టీ ఒక ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించిందని గూడూరు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ బత్తల రాధాజ్యోత్స్నలత, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా నిలవాలనే లక్ష్యంతో క్రియాశీల కార్యకర్త సభ్యత్వనమోదును తెలుగదేశం పార్టీ ప్రారంభించిందన్నారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు పలు సంక్షేమ పథకాలు వర్తించేలా అండగా నిలిచేందుకు పలు సంక్షేమ పథకాలు వర్తించేలా సభ్యత్వనమోదులో రూపకల్పన చేశారన్నారు. పట్టణంలో మొదట సభ్యత్వాన్ని ఛైర్‌పర్సన్‌కు, రెండో సభ్యత్వాన్ని వైస్‌ఛైర్మన్ శీలం కిరణ్‌కుమార్, మూడో సభ్యత్వాన్ని పార్టీ కార్యదర్శి పులిమి శ్రీనివాసులతో పాటు చదలవాడ హరిప్రసాద్‌నాయుడు తదితరులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, బాలిబోయిన రమేష్, షంషీర్, భాను, భారతి, విజయమ్మ, మురళీ, నాయకులు నాగరాజు, గోనుశివకుమార్, సుధాకర్‌రాజు, గోవిందరాజులు, యువసేన అధ్యక్షుడు గోను విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



## అర్జీదారులతో కిటకిట

వివిధ ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఉపకారవేతనాలకు అవసరమైన ధృవీకరణ పత్రాల కోసం అధికసంఖ్యలో రావడంతో తహశీల్దార్ కార్యాలయం కిక్కిరిసిపోయింది. సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా తహశీల్దార్ వెంకటనారాయణమ్మకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధికంగా చౌకదుకాణంలో సరకులు ఇవ్వడంలేదని, చౌకదుకాణంలో రేషన్‌కార్డు తొలగించినట్లుగా ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మండలంలోని కందలిలో పొలాలకు వెళ్లే దారిని ఆక్రమించినట్లుగా స్థానికులు విన్నవించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, పలువురు కౌన్సిలర్లు తహశీల్దార్ దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు.

# శ్రీకాళహస్తి న్యూస్



## ఘనంగా జ్యోతిర్లింగార్చన పూజలు



చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని ది స్కూల్ ఆవరణలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్, మాజీ మున్సిపల్ చైర్మన్ శాంతారాం జె.పవార్ పర్యవేక్షణలో వేద పండితులు మారుతీ శర్మ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం "లక్ష పార్థీవ శివలింగార్చన"ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా చేపట్టిన కార్యక్రమాన్ని ఎంతో చక్కగా, చూడముచ్చటగా నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రాలు చదువుతుండగా భక్తులు దగ్గర ఒక్కొక్క లింగం దగ్గర ఒక్కొక్క పండితులు ఉండి చాలా చక్కగా పార్థీవ లింగార్చన పూజలు చేయించారు. అతిథులతో, భక్తులతో స్కూల్ ఆవరణమంతా కిటకిటలాడింది. వేదికపై కలశస్థాపన గావించారు. వరుసగా 10శివలింగాలు ఏర్పాటు చేశారు. అందులో ఒక్కొక్క శివలింగానికి 10,800ల చిన్న చిన్న శివలింగాలను పుట్ట మట్టితో వేదపండితులు చేశారు. మొత్తం 10 శివలింగాలకు ఒకలక్ష 8000 లింగాలను తయారు చేశారు.ఒక్కొక్క శివలింగం దగ్గర ఆరు మంది దంపతులు కూర్చొని , ఒక పండితులు కూర్చొని 11 రుద్రాలను చదువుతూ వారి దగ్గర 11 రకాల సుగంధ ద్రవ్యాలతో, అభిషేకాల్ని, 11 మహాన్యాస రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అష్టోత్తర శత రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, రుద్రయాగం పూజల్ని నిర్వహించారు. ఉదయం శాంతారాం జె.పవార్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి.నాయుడు దంపతులు, ప్రముఖులు పారిశ్రామిక వేత్తలు పి.వి.ఆర్. బీడి ఫ్యాక్టరీకి చెందిన ప్రతాప్‌రావు పవార్, జనార్ధన్‌రావు పవార్ దంపతులతో కూర్చొని పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర జ్యోతిర్లింగార్చన సుమారు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పూజలు జరుగుతూనే ఉన్నాయి. పుణ్యక్షేత్రంలో నివసించే ప్రజలు, నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు రైతులు , మహిళలు సుఖశాంతులతో ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఈ పూజలు నిర్వహిస్తున్నామని వేదపండితులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ కోలా ఆనంద్, రష్ అధినేత సిపాయి సుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ పేట రాధారెడ్డి, లోకేష్ యాదవ్ , ది స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం 4 గంటల నుంచే భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. ఓ వైపు కార్తీక దీపాలతో మహిళలు, మరోవైపు యాత్రికుల భక్తులు, అయ్యప్ప స్వామి భక్తులతో ఆలయమంతా కిటకిటలాడింది.

# సమస్యలపై దృష్టి పెట్టండి



ఆర్డీవోను కలసిన ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, కౌన్సిలర్లు

గూడూరు డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీలకు అతీతంగా పరిష్కరించేందుకు దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, పలువురు కౌన్సిలర్లు, తెలుగుదేశంపార్టీ నాయకులు సోమవారం ఆర్డీవో రవీందర్‌ను కలిసి విన్నవించారు. పట్టణంలో పేదలను గుర్తించి 2009లో ఇళ్లస్థలాలు మంజూరు చేశారని, లబ్ధిదారులకు నేటికి స్థలాలు చూపించకపోవడంతో అద్దెఇళ్లల్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. నూతనంగా ఉద్యోగబాధ్యతలు చేపట్టిన ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఇంకా పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు కోడూరు శ్రీనివాసులురెడ్డి, మధురెడ్డి, మనపాటి రవీంద్రబాబు, రత్నం, కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, బాలిబోయిన రమేష్, భానుప్రకాష్, షంషీద్, విజయమ్మ, భారతి, కల్పన, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతిఒక్కరూ ఆ దిశగా ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, సంజీవయ్య అన్నారు. పట్టణంలోని మాళవ్యానగర్‌లోని పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా 8వ తేదీ స్ఫూర్తి సేవాసమితి ఆధ్వర్యంలో 26వ వార్డులోని అన్నీ కుటుంబాలకు చెత్త బుట్టలు, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. వ్యాధుల బారిన పడకుండా మనల్ని కాపాడుకోవాలంటే పరిశుభ్రత చాలా అవసరమన్నారు. పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ చెత్తబుట్టలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకొని విడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి వినియోగించాలన్నారు. పట్టణంలో శివప్రియతమ్ సేవా సంస్థ ఏర్పాటు చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయబోతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, రమేష్, స్ఫూర్తి సేవాసమితి నిర్వాహకులు బాలరాజు, ముప్పాళ్ల లక్ష్మీ, గోవిందు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వ్యాపారవృద్ధి అవకాశాలు, కొత్త పెట్టుబడులకు అవకాశాలు చేజారిపోవచ్చును. ఈ రాశి వారికి ఆదాయం సామాన్యం, శ్రమ ఎక్కువగా ఏదో ఒక రూపంలో ఉంటుంది. ఖర్చుల పెరుగుదల తప్పనిసరి. బంధువుల రాకపోకలుంటాయి. తీవ్ర అనారోగ్యం కాకపోయినా, అనారోగ్య బాధలుంటాయి. అనుకున్న పనులు నిదానంగా సాగినా నెరవేరగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

చేపట్టిన పనులకు చిన్నచిన్న ఇబ్బందులు రావడం వల్ల టెన్షన్‌గా ఉంటుంది. కుటుంబసభ్యుల వల్ల సమస్యలు, బాధలుంటాయి. దైవసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థికంగా వృత్తివ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. రాబడి పెరుగుతుంది. సభలు సమావేశాలలో పాల్గొంటారు. కమిటి మీటింగులు, అసోసియేషన్లలో మీ మాటకు విలువ, గుర్తింపు ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యాపారవృద్ధికి చేసే ప్రయత్నాలు ఫలితాల నివ్వగలవు. అయితే ఆదాయముకు తగ్గట్లు ఖర్చులు అదనంగా ఉంటాయి. ముఖ్య వ్యవహారాలను, సొంత పనులను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. ప్రభుత్వ అనుమతులు, కోర్టు వ్యవహారాల వాయిదా పడగలవు. తొందరపాటు ప్రవర్తన, తొందరపాటు మాటలు ఉండకుండా జాగ్రత్తపడండి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తివ్యాపారాలలో ఆదాయం తగ్గుతుంది. మంచి వ్యాపార అవకాశాలు, ఆర్థికావకాశాలు చేజారిపోతాయి. కుటుంబ ఖర్చులు పెరగడం, బంధువుల రాకపోకలు పెరగడం, అనుకున్న పనులు హడావిడిగా పూర్తి చేయడం జరుగుతుంది. వ్యవహారాలలో అయిన వారి వల్లనే సమస్యలుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కోర్టు కేసులు వాయిదా పడగలవు.



# బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 14.11.2014 నుండి**
**తేది. 20.11.2014 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, సింహ కన్య తులా రాశులలో చంద్రుడు, కన్యలో రాహువు, తులలో శని బుధులు, 16తేది నుండి వృశ్చికంలో రవి, వృశ్చికంలో శనిశుక్రులు, ధనుస్సులో కుజుడు సంచరిస్తారు.

### పంచాంగము:

16తేది విశాఖకార్తె ప్రారంభము.
శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.
శుభకార్యాలుండవు.

### కార్తీక మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 14 | శుక్ర | సప్తమి | ఉ॥గం.6.50వ॥ |
| తేది. 15 | శని | అష్టమి | ఉ॥గం.8.55వ॥ |
| తేది. 16 | ఆది | నవమి | ఉ॥గం.11.05వ॥ |
| తేది. 17 | సోమ | దశమి | మ॥గం.1.10వ॥ |
| తేది. 18 | మంగళ | ఏకాదశి | ప॥గం.2.58వ॥ |
| తేది. 19 | బుధ | ద్వాదశి | సా॥గం.4.22వ॥ |
| తేది. 20 | గురు | త్రయోదశి | సా॥గం.5.23వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఏదో ఒక రూపంలో ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారములందు ఆశించిన ఆదాయముండదు. తొందరపాటు ప్రవర్తనవల్ల అవకాశాలు చేజారి పోవచ్చును. వస్తు వాహన గృహరిపేర్లుంటాయి. కుటుంబంలో అనుకూలత తక్కువగా ఉండవచ్చును. అనుకున్న పనులు జరగడానికి బాగా శ్రమపడాలి. ఉద్యోగార్ధులకు అవకాశాలు రాగలవు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

మీ నుండి దూరమైన వారే మరల మీతో సన్నిహితంగా ఉండటానికి ప్రయత్నాలు చేస్తారు. కుటుంబఖర్చులు, అనారోగ్య ఖర్చులు అదనంగా ఉంటాయి. గృహ వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. షేర్లు పెట్టుబడుల మీద కొద్ది లాభాలుంటాయి. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా సాధించి నెరవేర్చుకొంటారు. కుటుంబ సామరస్యం, విద్యా ప్రగతి బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యాపార భాగస్వామ్యాలు, లీజులు ఏజన్సీలు లభించే అవకాశమున్నది. ఆదాయం సంతృప్తికరం. కాని అనుకోని ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. చేపట్టిన పనులను సంతృప్తికరంగా పూర్తి చేస్తారు. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు స్థాన చలనము గాని అదనపు బాధ్యతలుగాని ఉంటాయి. బ్యాంకు రుణాలు మంజూరు కాగలవు.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అన్ని పనులు ఒంటరిగా చేయవలసిన పరిస్థితి ఉంటుంది. టెన్షన్‌గా వున్నా సమర్ధవంతంగా పూర్తి చేస్తారు. వృత్తివ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయము పెరుగుతుంది. అనుకోని ఖర్చులు పైనబడే అవకాశమున్నది. కోర్టు కేసులు వాయిదా పడతాయి. రావలసిన డబ్బు నిలబడిపోతుంది. అనవసర వ్యవహారాలలోకి మిమ్మల్ని లాగడానికి ప్రయత్నిస్తారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చక్కని నిర్ణయాలతో చేపట్టిన పనులు పూర్తి చేస్తారు. ఆర్థిక లావాదేవీలు, వృత్తివ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఆదాయవృద్ధి ఉంటుంది. కుటుంబ వ్యవహారాలలో కొద్దిపాటి చికాకులుండి సర్దుబాటు కాగలవు. విలువైన వస్తువులు, గృహోపకరణాలు సమకూర్చుకుంటారు. ఉద్యోగార్ధులకు అవకాశాలు దొరకవచ్చును. ఉద్యోగ నిర్వహణలో గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. షేర్లు పెట్టుబడులపై లాభాలుంటాయి.

## సింహాం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉపాధి పథకాలు, వ్యాపారాల ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆదాయం కొద్దిగా పెరుగుతుంది. అప్పులు, హామీలకు దూరంగా ఉండండి. శుభకార్య ప్రయత్నాలందు అనుకూలత, ఉద్యోగులకు స్థానమార్పులు, అదనపు బాధ్యతలుంటాయి. షేర్లు స్థిరాస్తులపై లాభాలుంటాయి. ప్రముఖులతో పరిచయాలు, దూరప్రయాణాలుండగలవు. నిరుద్యోగులకు అవకాశాలు లభించవచ్చు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బంధుత్వాలు, పరిచయాలు బలపడతాయి. అనుకున్న పనులు ఏదో ఒక రీతిలో సాధించుతారు. వ్యాపార, వృత్తి జీవనం కలవారికి మంచి అవకాశాలు లభించి, ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగార్ధులకు అవకాశాలు దొరుకుతాయి. పెండింగ్‌లో వున్న పనులు మరల కొనసాగుతాయి. పెట్టుబడులు, షేర్ల మీద లాభాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ముఖ్య వ్యవహారాలలో నిర్ణయాలు చేయలేక సతమతము కాగలరు. చేపట్టిన పనులు ఆటంకాలతో నిదానంగా జరుగుతాయి. ఖర్చుల భారం పెరుగుతుంది. వృత్తివ్యాపారాలలో ఆదాయం సామాన్యంగా ఉంటుంది. తొందరపాటు నిర్ణయాలు చేసి నష్టపడే అవకాశం ఉన్నది. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం.

# స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థుల పాట్లు

నెల్లూరుజిల్లా వింజమూరు మండలంలో ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌ల కోసం ధృవీకరణ పత్రాలు సకాలంలో అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేవైయం వింజమూరు శాఖ కార్యదర్శి ఎల్.రాజేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు కుల, నేటివిటి, జనన ధృవీకరణ పత్రంతో పాటు ఆదాయ ధృవీకరణ పత్రాలు మీ సేవలో తీసుకుని ఆయా విద్యాసంస్థలు అందజేయాల్సి వుందన్నారు. విద్యార్థులకు సర్టిఫికేట్లు అందక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, ఈ పత్రాల కోసం ముడుపులు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. మండల రెవెన్యూ అధికారులు ధృవీకరణ పత్రాలను సకాలంలో అందజేయాలన్నారు. లేకుంటే ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షులు జి.ప్రసాద్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరుకు కారాగార శిక్షణా కేంద్రం

నెల్లూరుజిల్లా కేంద్రానికి కారాగార శిక్షణా కేంద్రం మంజూరయిందని, త్వరలో నిర్మాణపనులు చేపడతామని జైళ్లశాఖ డిఐజి సత్యవర్ధన్ తెలిపారు. ఆదివారం గూడూరు సబ్‌జైలును డిఐజి ఆకస్మికంగా తనిఖీ చేసి, వంటలను పరిశీలించారు. ఖైదీలకు ఇస్తున్న సౌకర్యాలపై డిఐజి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని ఖైదీల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ సబ్‌జైలులో ఖైదీల సంఖ్య ఎక్కువగా ఉన్నందున ఇతర జైళ్లకు తరలిస్తున్నామన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జిల్లాలో కారాగార శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకుగాను 7ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. నిధులు రాగానే నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, గూడూరు జైలర్లు పాల్గొన్నారు.

# ఇందుకూరుపేటలో డెంగ్యూ

నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట కొత్తూరు తదితర ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలమయ్యాయి. వర్షాకాలం మొదలవడంతో ఇందుకూరుపేట మండలం అంటువ్యాధుల మయంగా మారింది. దీంతో డెంగ్యూ, చికున్‌గున్యా తదితర జ్వరాలతో ప్రజలు నెల్లూరు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామంలోని ఆరోగ్య శాఖ వారు ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు.

# జాక్టో కన్వీనర్‌గా కృష్ణారెడ్డి

పిఆర్‌టియు నెల్లూరుజిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల సంయుక్త మండలి(జాక్టో) కన్వీనర్‌గా కృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ సంఘాలన్నింటిని కలుపుకుని ఈ నెల 20వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం, ధర్నాకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిటిఏ తరపున రఘు, ఏపి యూఎస్ తరపున మల్లిఖార్జున టిఎన్ యుఎస్ తరపున మాలకొండయ్య, ఎంఈఓ అసోసియేషన్ తరపున జగన్నాథ శర్మ తదితరులు పాల్గొన్నారు. జాక్టో రాష్ట్ర పరిశీలకులు పోలయ్య బిటిఏ రాష్ట్ర కోశాధికారి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# అటవీ ఉద్యోగులకు స్థాన చలనం

నెల్లూరుజిల్లా అటవీశాఖలోని టెర్రిటోరియల్ సామాజిక వనవిభాగం, తెలుగు గంగ తదితర విభాగాలకు చెందిన అన్ని కేటగిరీల ఉద్యోగుల్లో స్థానచలనం జరగనున్నట్లు సమాచారం. జిల్లాలోని 6రేంజ్‌ల నుంచి 252మంది ఉద్యోగులు బదిలీపై వెళ్ళనున్నారు. వీరిలో టెర్రిటోరియల్ విభాగానికి సంబంధించి నలుగురు అధికారులు, 24మంది డిఆర్వోలు, 22మంది ఎఫ్ఎస్‌వోలు, 43మంది ఎఫ్‌బీవోలు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు ఉన్నట్లు సమాచారం.

# నెల్లూరులో చిన్నయ్య విగ్రహం పెట్టాలి

భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రను తెలుగులో తర్జుమా చేసి ప్రతి దళితుడికి అంబేద్కర్‌ను గురించి తెలియజేసిన డాక్టర్ ఇ.వి.చిన్నయ్య విగ్రహాన్ని నెల్లూరులో ఏర్పాటు చేయాలని ఏపి దళిత విద్యార్థిసేన జిల్లా అధ్యక్షులు అరవ పూర్ణప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ నెల 9వ తేదీ నెల్లూరులోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన డాక్టర్ ఇ.వి.చిన్నయ్య సంతాపసభలో ఆయన మాట్లాడుతూ చిన్నయ్య విద్యార్థి దశ నుండే అంబేద్కర్ ఆలోచనా విధానానికి ఆకర్షితుడై ఆయన మార్గంలో పయనించారన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి, ఎస్సీ, ఎస్టీ నాయకులు పి.నరసింహవర్మ, అరవ రమేష్‌బాబు, కె.ఎలీషాకుమార్, వాదనాల వెంకటరమణ, ప్రశాంత్ కిరణ్, డి.రాజశేఖర్, టి.వెంకయ్య, పల్లం వేణుగోపాల్, జెన్ని రమణయ్య, నూకలపాటి దాసు, నన్నం రామారావు, తుమ్మల మేరి, అరవ నిర్మల, రాజశేఖర్, పండు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# క్రికెట్ విజయంతో సంబరాలు



నెల్లూరుజిల్లా ముస్లిం సేవాకమిటి ఆధ్వర్యంలో నెల్లూరు చిన్నబజారు ఏసి సుబ్బారెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో సోమవారం టీమిండియా శ్రీలంకపై 3-0తో విజయం సాధించి రికార్డు సృష్టించిన సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నట్లు జిల్లా అధ్యక్షులు ఎస్.కె. ఖాలీద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నా, మున్వర్, జమీర్, ఫజల్, ఇస్సాక్, ఎజాజ్, జమీర్, హారున్, ఇమ్రాన్, అజ్గల్ అలీ, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# 10వేల దీపాలతో మహారుద్రాభిషేకం

నెల్లూరు ట్రంకురోడ్డులోని శ్రీ షిర్డిసాయి బాబా మందిరం, సింహపురి హాస్పిటల్స్ సౌజన్యంతో ఈ నెల 20వ తేదీ గురువారం కార్తీక బహుళ త్రయోదశి సందర్భంగా 10వేల దీపాలతో శతసహస్ర దీపాలంకరణ సేవ, మహారుద్రాభిషేకం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం విఆర్‌సి మైదానంలో జరుగుతుందని నిర్వాహకులు ప్రసాద్ స్వామి తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, భక్తులు అభిషేకమునకు పాలు, దీపారాధనకు ఆవునెయ్యి అందజేయాలని ఆయన కోరారు.

# ఆనందోత్సవంగా బాలలదినోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

అత్యద్భుతంగా చిన్నారులు ప్రదర్శిస్తున్న నృత్యాలు చూస్తూ, పాడుతున్న పాటలు వింటూ గంటల కొద్ది అలాగే నిలుచుండి పోయారు. జాతీయ నేతల వేషధారణతో వచ్చిన విద్యార్థులు జ్యోతిప్రజ్వలనతో వేడుక మొదలైంది. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా చిన్నారులు ఒక్కొక్కరు ఒక్కో కళారూపాన్ని ప్రదర్శిస్తూ ప్రేక్షకులను కట్టిపడేశారు.

ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా ప్రముఖ వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మీయ అతిథులుగా నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ప్రముఖ సినీ గేయరచయిత వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ టి.రవి కుమార్‌లు పాల్గొన్నారు.

## చిన్నారుల ప్రతిభకు కానుక 'విజయదీపిక'

నెల్లూరులోని వివిధ పాఠశాలల్లో చదువుతూ ఆయా రంగాలలో ప్రతిభ చూపిస్తున్న విద్యార్థుల విజయగాథలతో 'లాయర్' రూపొందించిన 'విజయదీపిక' ప్రత్యేక సంచికను అతిథులు తమ చేతుల మీదుగా ఆవిష్కరించి చిన్నారి లోకానికి కానుకగా అందజేశారు.

## వెలకట్టలేని సత్కారం

దాతగా, సేవకుడిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంతవరకు ఎన్నో సన్మానాలు అందుకుని ఉండొచ్చు. మరెన్నో అవార్డులు పొంది ఉండొచ్చు. కాని ఈ వేడుకలో ఆయనకు జరిగిన సన్మానాన్ని దేనితోనూ కొలవలేము, పోల్చలేము. ఎందుకంటే ఈ సన్మానం చేసింది 'లాయర్' వారపత్రిక యాజమాన్యమో, నగరానికి చెందిన ప్రముఖులో కాదు... ప్రగతి ఛారిటీస్ మరియు వాత్సల్య అనాధాశ్రమాలలో ఉంటున్న మానసిక వికలాంగులైన విద్యార్థులు, అనాధలైన చిన్నారులు. ఈ రెండు సంస్థలకు వేమిరెడ్డి భారీగా విరాళాలిచ్చి ఉన్నారు. రోజూ తాము తినే ప్రతి మెతుకులోనూ వేమిరెడ్డిని చూసుకునే ఆ చిన్నారులకు ఈరోజు స్వయంగా ఆయనను సత్కరించే అవకాశం దొరికినందుకు ఏనుగెక్కినంత సంబర పడ్డారు. మానసిక వికలాంగులైన ఆ చిన్నారులు వేమిరెడ్డిని సత్కరించేటప్పుడు ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో హర్షం ప్రకటించారు. పూర్తి సెంటిమెంట్‌తో కూడిన ఈ సన్మానం అందరి కళ్లు చెమర్చేలా చేసింది.




## దైనందిన జీవితంలో సేవాతత్పరత అవసరం

దైనందిన జీవితంలో సేవాతత్పరత అవసరమని, నెల్లూరులో ఎన్నో సేవా సంస్థలున్నప్పటికి వాత్సల్య, ప్రగతి అనాధలను, వికలాంగులను అక్కున చేర్చుకుని వారికి అందిస్తున్న సేవలు అభినందనీయమని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నేటి సమాజంలో పెళ్లిళ్లకు, జన్మదినాలకు ఎంతో ఖర్చు చేస్తున్నారని, అనాధలకు, మానసిక వికలాంగుల కోసం కొంతైనా వారికి చేయూతనిచ్చి ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. 'లాయర్' పత్రిక విజయవంతంగా నిర్వహించిన ఇలాంటి కార్యక్రమాలను గురించి జిల్లా అధికారులు 'లాయర్' యాజమాన్యం ద్వారా తెలుసుకుని కార్యక్రమాలను నిర్వహించుకోవాల్సి వుందన్నారు.

ప్రముఖ సినీ గేయరచయిత వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులు చేసిన నృత్యాలు సినీ డ్యాన్సర్లు కూడా చేయలేరని చిన్నారులను అభినందించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్న 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి అభినందనీయుడన్నారు.

ప్రముఖ చిన్నపిల్లల డాక్టర్ టి.రవికుమార్ మాట్లాడుతూ 'లాయర్' పత్రిక రూపొందించిన చిన్నారుల 'విజయదీపిక' పుస్తకం చాలా బాగుందని, వచ్చే ఏడాది బాలల దినోత్సవానికి వైద్యానికి సంబంధించి అన్ని విషయాలను క్రోడీకరించి 'లాయర్' అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక సంచికను విడుదల చేయాలని కోరారు. తల్లిదండ్రులు చిన్నారుల విషయంలో శ్రద్ధ వహించాలన్నారు.

సభా కార్యక్రమానికి ముందు నేతాజీ పైలట్ స్కూల్, ఎస్ఆర్‌కె స్కూల్, శ్రీగురుకృప కళాక్షేత్రం, కెకెఆర్ స్కూల్, మైథిలి స్కూల్, రత్నం స్కూల్, ప్రగతి ఛారిటీస్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. 'లాయర్' వారపత్రిక నెహ్రూ జీవితచరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రథమ బహుమతి ఎస్.సాయిరోహిత్, ద్వితీయ బహుమతి యం.నిలయ, తృతీయ బహుమతి ఎన్.శ్రీషితలకు వరుసగా పదివేలు, అయిదు వేలు, మూడువేల రూపాయలు, ప్రశంసాపత్రాన్ని ముఖ్యఅతిథులు అందించారు. కన్సోలేషన్ బహుమతులుగా 16మంది విద్యార్థులు టి.జవాలి, రాజేశ్వరి, పి.సుభాష్, మునిమాధురి, ఆర్.శ్రావణి, బి.సాయిఉమ, స్పందన, ఎన్.వి.మీనాక్షి, టి.ప్రాజ్ఞరెడ్డి, పి.తనిష్క్, పి.సాయితన్వీ, జి.ఉత్తరకుమార్, కె.రచన, ఎ.సాయికుషల్, బి.అభిజిత్, పియస్ఎల్ సంశ్రియలకు ఒక్కొక్కరికి రూ.500లు ప్రసంసాపత్రాలను అందించారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికి ప్రశంసాపత్రాలను స్కూలు యాజమాన్యాలకు అందజేశారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణను 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి నిర్వహించారు. విద్యార్థులతో టౌన్‌హాలు ప్రాంగణం కిక్కిరిసింది. వ్యాఖ్యాతగా బెనర్జీ, సాంస్కృతిక కార్యక్రమాల పర్యవేక్షకుడిగా కళాంజలి అనంత్ వ్యవహరించారు.

దాదాపు నాలుగు గంటలపాటు కార్యక్రమం జరిగినా చిన్నారులు కదలకుండా ఆసక్తిగా కూర్చుని తిలకించడం విశేషం.

# ఆ నలుగురు

(మొదటిపేజీ తరువాయి)

సూళ్లూరుపేటలో కాంగ్రెస్‌కు ఇంతకాలం వెన్నెముకగా నిలిచిన నాయకుడు, శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గంలో ఎదుగుతున్న నాయకుడు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆ బ్యాంకు ఉపాధ్యక్షులు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ఆనం సోదరులలో ఒకరు, జైసమైక్యాంధ్ర నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డిలు సంయుక్తంగా సైకిల్ ఎక్కారు. మంత్రి పి.నారాయణతో పాటు జిల్లా పెద్దనాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద రవిచంద్ర, కంభం విజయరామిరెడ్డిలు వీరిని దగ్గరుండి పార్టీలో చేర్పించారు.

మొన్న ఎన్నికలలో ఫలితాలు రాగానే వాకాటి నారాయణ రెడ్డికి పరిస్థితి అర్థమైంది. ఇక ధనుంజయరెడ్డి తెలుగుదేశంలో చేరాలని వ్యక్తిగతంగా నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్‌లో ఉండి ఉపయోగం లేదనే రీతిలో నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి బయటకు రాగా, ఆనం జయకుమార్‌రెడ్డి మాత్రం తన సోదరులతో సంబంధం లేకుండా స్వతంత్రంగా తన రాజకీయ భవిష్యత్ కోసమే తెలుగుదేశంలో చేరారు.



హుద్‌హుద్ తుఫాన్ బాధితుల కొరకు భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవసభ మరియు కళాంజలి సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సేకరించిన రూ.7,500/- విరాళాన్ని ఈ నెల 10వ తేదీన జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌కు అందజేస్తున్న కళాంజలి అనంత్, దువ్వూరు బెనర్జీ, జి.వి.శర్మ, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎన్.బలరామయ్యనాయుడు

# కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరం



లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు, కృత్రిమ అవయవాల తయారీ సంస్థ సంయుక్తంగా ఈ నెల 20వతేదీన నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు వికలాంగుల కోసం కృత్రిమ అవయవాల పంపిణీ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షులు కృష్ణమోహన్, కార్యదర్శి ఇ.సురేష్‌కుమార్‌లు తెలిపారు. గురువారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అక్టోబర్ 17వ తేదీన నెల్లూరు టౌన్‌హాల్‌లో నిర్వహించిన వికలాంగుల మెగా ఉచిత వైద్యశిబిరంలో ఎంపిక చేసిన 826మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సింహపురి హాస్పిటల్స్ సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు, వికలాంగులకు ఆరోజు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. సింహపురి హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవీంద్రరెడ్డి మాట్లాడుతూ గత నెల 17వతేదీన జరిగిన వికలాంగుల వైద్యశిబిరానికి తాను హాజరయ్యానని, ఆ శిబిరంలో వికలాంగులకు లయన్స్‌క్లబ్ వారు చేసిన సేవల పట్ల సంతృప్తి చెంది ఈ వైద్యశిబిరంలో తమ హాస్పిటల్ ద్వారా కూడా సేవలందించడానికి నిర్ణయించామన్నారు.

# బుద్ధప్రదేశ్

(మొదటిపేజీ తరువాయి)

పక్కా ప్రణాళికతోనే సింగపూర్ పర్యటనకు వెళ్లారు. రాజధాని నిర్మాణానికి కేంద్రప్రభుత్వాన్ని నమ్ముకుంటే ఏళ్లు గడిచిపోతాయి. ఎందుకంటే ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడ్డ చత్తీష్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల రాజధానుల వ్యవహారమే ఇంకా ఒక కొలిక్కి రాలేదు. వాటికి ఒక రూపం రాలేదు. ఇక ఇప్పుడు మన రాజధాని నిర్మాణం మొదలుపెడితే అది ఎప్పటికి ఒక దారికి వస్తుందో చెప్పలేని పరిస్థితి. కేంద్రం నుండి వచ్చే నిధులను నమ్ముకుంటే చంద్రబాబు సింగపూర్ లాంటి రాజధానిని కట్టినట్లే! అందుకే ఆయన సింగపూర్ వంటి రాజధాని కోసం సింగపూర్‌నే నమ్ముకున్నాడు. బుద్ధసెంటిమెంట్‌తో సింగపూర్‌కు అయింట్‌మెంట్ పూసే పనిలో పడ్డాడు. సింగపూర్‌కు వెళ్లే ముందే ఆయన సింగపూర్‌ను తలపించేలా ఉండే విధంగా రాజధాని డిజైన్‌ను తీసుకెళ్లాడు. రాజధాని ప్రాంతంలో కృష్ణానదిని చూపిస్తూ అమరావతి ప్రాంతంలో బుద్ధుని భారీ విగ్రహాలు, బౌద్ధారామాలు, బౌద్ధస్థూపాలు ఎక్కువగా పెట్టించాడు. ఇక బౌద్ధ సంస్కృతి పరంగా అమరావతికి ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్‌నే బుద్ధప్రదేశ్‌గా చూపించారు. నూతన రాజధానిలో అడుగడుగునా బౌద్ధ సంస్కృతి ప్రతిబింబించేలా డిజైన్ రూపొందించారు. రాజధానిలో బౌద్ధ సంస్కృతికి ప్రాధాన్యత కల్పిస్తే రాజధాని నిర్మాణానికి సింగపూర్ ప్రభుత్వంతో పాటు బౌద్ధమత గురువు దలైలామా కూడా అన్ని విధాలా సహకరించేందుకు హామీ ఇచ్చినట్లు సమాచారం. దలైలామా ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్‌లో ఎక్కువుగా ఉంటున్నారు. టిబెట్‌కు ఆధిపత్యం వహిస్తున్న ఆయనకు చైనాతో పడడం లేదు. అందుకే భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అమరావతిని బౌద్ధ కేంద్రంగా చేస్తే దలైలామా ఇక్కడికే వచ్చి స్థిరపడే అవకాశాలున్నాయి. బౌద్ధం సెంటిమెంట్‌ను చూపిస్తే సింగపూర్‌తో పాటు భవిష్యత్‌లో జపాన్ వంటి దేశాల సహకారం కూడా పొందవచ్చు. ఇప్పటికే దేశంలో, రాష్ట్రంలో స్మార్ట్‌సిటీల నిర్మాణానికి తాము సహకరిస్తామంటూ జపాన్, సింగపూర్‌లు ముందు కొస్తున్నాయి. ఆ దేశాలు ఇచ్చిన ఆఫర్‌ను అంది పుచ్చుకుని రాజధాని నిర్మాణంలో వారిని భాగస్వాములను చేయడానికే చంద్రబాబు సింగపూర్ యాత్ర పెట్టుకున్నాడు. ఏదో ఒక దేశం ముందుకొచ్చి సహకరించి రాజధాని నిర్మాణం మొదలుపెడితే రాష్ట్రంలో మిగిలిన సమస్యల నుండి తప్పించుకోవచ్చునేది చంద్రబాబు ఆశ!

8వ వర్ధంతి



మా కంటి వెలుగు, మా ఇంటి మహాలక్ష్మి
శ్రీమతి అళహరి నాగరాజేశ్వరమ్మ గారు
పరమపదించి 2014, నవంబర్ 18వ తేదీకి 8సంవత్సరాలు నిండుతాయి.
ఆమె తీపి జ్ఞాపకాలను సంస్మరించుకుంటూ కన్నీటి నివాళి అర్పిస్తున్నాం.
భర్త : అళహరి సత్యనారాయణ
మరియు కుటుంబసభ్యులు

గల్పిక

# నెల్లూరు నగరంలో సచిన్ షికారు

అది ఐఆర్20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధి చెందిన నెల్లూరు నగరం. అయ్యప్పగుడి సెంటర్ వద్ద ముదురుదోమల శాఖ మంత్రి పి.నారాయణ, మాటల మిసైల్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ రేఖారాణి, ఎస్పీ సెంథిల్‌కుమార్‌లు, కార్పొరేటర్లు, తెలుగుదేశం, వైకాపా, కాంగ్రెస్ నాయకులు మరికొందరు అక్కడ చేతుల్లో పూలబొకేలతో నిలుచుని ఉన్నారు. అందరూ యూనిఫాంగా భారత క్రికెట్ టీం వేసుకునే డ్రెస్సులను వేసుకుని వచ్చారు. అయితే అక్కడున్న అందరూ ఫ్రీగా ఉండగా జాయింట్‌కలెక్టర్ మాత్రం దేనిగురించో ఆలోచిస్తూ ఆందోళన చెందసాగింది. అంతలో అక్కడకు క్రికెట్ డ్రెస్‌లోనే కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కూడా వచ్చారు. ఆయన చేతిలోనూ ఒక పూలబొకే ఉంది. ఆ తర్వాత స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి కూడా వచ్చాడు. ఆయన డ్రెస్‌తో పాటు చేతికి గ్లోవ్స్, కాళ్లకు ప్యాడ్స్, నెత్తిన హెల్మెట్‌తో పాటు చేతిలో బ్యాట్ పట్టుకుని వచ్చాడు. సీన్ చూడబోతే వీళ్లంతా ఏదో ఇతర దేశంతో క్రికెట్ ఆడడానికి పోతున్నట్లుగా వుంది. కాని అంతలో అక్కడకు కొన్ని కార్లు వచ్చాయి. ఒక కారులో నుండి మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ దిగాడు. ఆయనకు అనూరాధ, అంచలవాణి మంగళహారతినివ్వగా మిగతా నాయకులంతా పూలబొకేలతో స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ రేఖారాణి వచ్చి... సార్, కారెక్కండి, గెస్ట్‌హౌస్‌కు పోదామంది. ఆ మాట చెప్పేటప్పుడు కూడా ఆమె ముఖంలో ఆందోళన కనిపించింది. వెంటనే వెంకయ్యనాయుడు... సచిన్ లాంటి ప్రపంచశ్రేణి వ్యక్తి మొదటిసారిగా నెల్లూరొచ్చాడు, మన ఊరి అందాలను ఆయనకు చూపిద్దామమ్మా, నడుచుకుంటూ వెళ్దాం అని చెప్పాడు. మీ ఖర్మ నేనేం చేసేది అని రేఖారాణి మనసులో అనుకుంది. ఆ తర్వాత అందరూ నడక మొదలుపెట్టారు. వేదాయపాలెం వద్ద కొచ్చేసరికి అక్కడి వ్యాపారస్థులు కొందరు వెంకయ్యనాయుడు వద్దకొచ్చి... సార్, రోడ్డు వెడల్పుకు మార్కింగ్ ఇచ్చారు. మా షాపులు పోతున్నాయి. రోడ్డున పడతాం అని వాపోసాగారు. అప్పుడు వెంకయ్య... ఏంఫర్లేదు, మీ షాపులు తొలగించి మా కార్పొరేషన్ వాళ్లు అక్కడి దాకా సిమెంట్ రోడ్డు వేస్తారు. మీకు క్రింద గచ్చు వేసుకునే పని కూడా వుండదు. దాని మీదే మళ్లీ మీరు వ్యాపారాలు చేసుకోవచ్చు అని చెప్పాడు. సచిన్‌కు తెలుగు అర్థంకాక ఏంటి వాడి ప్రాబ్లం అని ఇంగ్లీష్‌లో అడిగాడు. దానికి వెంకయ్య... వ్యాపారులు రోడ్లను ఆక్రమించి షాపులు కడుతుంటే మా మున్సిపాల్టీ వాళ్లే అనుమతిస్తారు, ఆ తర్వాత ఆక్రమణలంటూ మావాళ్లే కూలగొడతారు. వాళ్లకు చేతి నిండా పని ఉండడం కోసం ఇలా చేస్తుంటారని చెప్పాడు. అలా నడుచుకుంటూ నిప్పో సెంటర్ వద్ద కొచ్చేసరికి అక్కడ రోడ్డు మీదే సాయిబాబా గుడి కనిపించింది. అది చూసి సచిన్, అదేంటి గుడిని అలా రోడ్డు మీద కట్టారని అడిగాడు. వెంటనే వెంకయ్య... మా నెల్లూరోళ్ల పాలసీ ఒక్కటే... మనకు లేని ప్రశాంతత దేవుడికి మాత్రం ఎందుకుండాలనుకుంటారు. మా వాళ్లు ఇరుకు సందుల్లో వాహనాల రణగొణధ్వనుల మధ్య బ్రతుకుతుంటారు కాబట్టి దేవుడికి కూడా అలాంటి వాతావరణమే కల్పించారని చెప్పాడు.

అప్పుడే ఒక వ్యక్తి సైకిల్ మీద సమోసాలు అమ్ముకుంటూ పోతున్నాడు. వెంటనే వివేకా అతన్ని ఆపి జేబులో నుండి పర్సు తీసి అందులో నుండి సొంత నిధులు 20రూపాయలు తీసి సమోసాలు కొన్నాడు. వాటిని పేపర్లలో పెట్టి, సార్, రాకరాక మా ఊరి కొచ్చారు. మా ఆతిథ్యం స్వీకరించండి సార్ అని అడిగాడు. వివేకా గెటప్‌ను చూసిన సచిన్... మీరు బ్యాట్‌తో బాగా ఆడుతుంటారా? అని అడిగాడు. ఏ బ్యాట్‌తో సార్? అంటూ వివేకా ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు. మీ చేతిలో వున్నది క్రికెట్ బ్యాటే కదా, దాంతోనే అని సచిన్ అన్నాడు. ఆ మాటకు వివేకా... చిన్నప్పుడు ఆడాలనుకునే వాడ్ని సార్... అప్పుడు ఆడలేకపోయాను, ఇప్పుడు కనీసం ఆ డ్రస్ కోడ్, చేతిలో బ్యాట్‌తో ఆ ముచ్చట తీర్చుకుంటున్నానని చెప్పాడు. చిన్నప్పుడు బ్యాట్ కొనడానికి డబ్బుల్లేవా అని సచిన్ అడిగాడు. లేకేం సార్, ఎన్నిసార్లో క్రికెట్ బ్యాట్ కొంటానంటే మా నాయన డబ్బులిచ్చాడు. కాని ఆ డబ్బులతో సిగరెట్లు తాగి, స్కూల్ గోడ దూకి సినిమాలకెళ్లే వాడిని. కాని ఇప్పుడు గనుక నాకు ఇరవై ఏళ్లుంటే ఖచ్చితంగా క్రికెట్ ప్లేయర్‌ను అయ్యుండేవాడిని అని వివేకా చెప్పాడు. ఇప్పుడు ఎందుకు కావాలనుకుంటున్నారని సచిన్ అడిగాడు. ఇప్పుడే కదా సార్, హీరోయిన్లంతా క్రికెట్ స్టార్‌ల వెంట పడుతున్నారు. మొన్న చూళ్లేదా ఉప్పల్ స్టేడియంలో విరాట్ కోహ్లి అనుష్కశర్మకు గాలిముద్దు పెట్టడం... అలాంటి ఛాన్స్‌ల కోసమైనా క్రికెట్ ప్లేయర్‌ను అయ్యుండేవాడినని వివేకా అన్నాడు. సచిన్ వివేకా వైపు వికారంగా చూసి ముందుకు కదిలాడు. నగరంలో రాకెట్‌లా దూసుకుపోతున్న టౌన్‌బస్సులు, ఆటోలను చూసి సచిన్ ఆశ్చర్యపోయాడు. సచిన్ ఇదే విషయాన్ని వెంకయ్యతో ప్రస్తావిస్తే, ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పుడు బుల్లెట్ ట్రైన్స్ అంటున్నాడు, కాని మా నగరంలో మేమెప్పుడో బుల్లెట్ ఆటోలు, బుల్లెట్ టౌన్‌బస్సులను ప్రవేశపెట్టామని గర్వంగా చెప్పాడు. తర్వాత సచిన్‌కు నగరంలో మాగుంట లే అవుట్, రామలింగాపురం, విజయమహల్‌గేటు, ఆత్మకూరు బస్టాండ్ అండర్‌బ్రిడ్జిలను చూపించారు. వీటి ప్రత్యేకత ఏంటని సచిన్ అడిగాడు. అప్పుడు కోటంరెడ్డి... సార్, ఇవి టూ ఇన్‌వన్ బ్రిడ్జిలు. వేసవికాలంలో వాహనాలలో అటూ ఇటూ తిరగొచ్చు. వానాకాలంలో పడవలు తిప్పుకోవచ్చు. అంతేకాదు, ఈ వర్షాకాలంలో వీటిని ఫిష్‌పాండ్‌లుగా కూడా వాడుకోవచ్చు. ఐదేసి కిలోల చేపలు కూడా పడుతుంటాయని చెబుతుండగా... జాయింట్ కలెక్టర్ రేఖారాణి ఆగ్రహంతో... ఇక ఆపండి మీ కబుర్లు, ఇప్పటిదాకా తిప్పింది చాలు, సచిన్‌ను కృష్ణపట్నం పోర్టుకు పంపించేద్దాం అని చెప్పింది. అప్పుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి... నేను సచిన్ వచ్చినప్పటి నుండి చూస్తున్నాను మేడమ్ మీరు చాలా టెన్షన్ పడుతున్నారు... ఎందుకని అంత ఆందోళన చెందుతున్నారని అడిగాడు. దానికి రేఖారాణి... చీకటిపడే టైం అయింది, ఇక మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు విజృంభించే సమయం ఆసన్నమైంది, అవి కరచి సచిన్‌కు డెంగీ, చికున్‌గున్యా వంటి జ్వరాలొస్తే దానికి మనమే బాధ్యులమవుతాం... ఆయనను పిలిపించింది నేనే కాబట్టి ఆయనకు ఎటువంటి హాని కలగకుండా చూడాల్సిన బాధ్యత కూడా నాదే కదా అని చెప్పింది. ఆ మాట విని కోటంరెడ్డితో పాటు సచిన్ కూడా నవ్వసాగాడు. వారి నవ్వు చూసి రేఖారాణితో పాటు మిగతా వాళ్లు కూడా అవాక్కయ్యారు. ఎందుకు అలా నవ్వుతున్నారు, నేను అన్నదాంట్లో తప్పేముందని రేఖారాణి అడిగింది. అప్పుడు కోటంరెడ్డి... డోంట్ వర్రీ మేడమ్, మీకు తెలియని విషయం ఒకటి చెబుతాను, నెల్లూరు ముదురుదోమల గురించి భారత క్రికెటర్లు భయపడాల్సిన పనిలేదు. ఎందుకంటే భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రతి ఆటగాడిని నెల్లూరు దోమలకు అలవాటు పడేలా ట్రైనింగ్ ఇస్తుంది. క్రికెటర్లు నిద్రపోయే గదుల్లో రాత్రివేళల్లో నెల్లూరు నుండి ప్రత్యేకంగా తెప్పించిన ముదురుదోమలను వదిలేవాళ్లు. అవి కరచి కరచి వారి శరీరాలు మొద్దుబారేవి. ఇక్కడ ఈ దోమలకు అలవాటైతే ఆటగాళ్లు విదేశాలలో సైతం ఎలాంటి కీటకాలు కరిచినా తట్టుకుని ఉండగలరు. సచిన్‌కు కూడా నెల్లూరు దోమలు ఆ విధంగానే అలవాటయ్యాయి. కావాలంటే చూడండి, గంట నుండి ఆయన కాలిని దోమలు చుట్టుముట్టే ఉన్నాయి. కాని ఆయన మాత్రం ఎంత నిబ్బరంగా ఉన్నారో అని చెప్పాడు. అందరూ సచిన్ కాళ్లవైపే చూసారు. నిజమే, దోమలు గుంపుగా కరుస్తున్నా సచిన్ చలించడం లేదు. అది చూసి ముదురుదోమల టెన్షన్ నుండి తనకు ఉపశమనం కలిగించినందుకు కోటంరెడ్డికి రేఖారాణి థాంక్స్ చెప్పింది. అక్కడ నుండి సచిన్ పోర్టుకు బయలుదేరడంతో అందరూ వెనుదిరిగారు.

కదంబం

## తీరం గూడు

– దాట్ల దేవదానం రాజు
యానాం. 94401 05987

అనంత ప్రాకృతిక జన్య విశేషానివి
అనితర ప్రత్యమ్నాయం లేదు
కొసరు ఉంది కొరత లేదు
పుష్కలమైన గాలి అంతులేని సంద్రపు నీరులా
రాసలు రాసులు నీ అస్తిత్వం.

స్ఫటిక రేణువుల రూపం
సిమెంటు మిళితమైనపుడు
నీ శక్తి అమేయం.. అనన్య సామాన్యం
అంతస్తులై ఎగబాకిన
నిర్మాణ కౌశల ఉత్ప్రేరకం నీవు
ఆకాస హర్మ్యాల అంతెత్తు చిరునామా నీవు

మానవ కల్పిత మాయాజాలం
డబ్బు చూసుకునే నిధుల ఖజానా అయి
నీ చుట్టూ –
ఎన్నో మాఫియా పడగ నీడలు
నిను కౌగిలించుకుంటూ –
రాజకీయ దళసరి తోలు మందాలు
ఇపుడు నీవొక గలగలల కాసుల పేరు
తవ్వే కొలదీ తులాల ప్రమాణంతో
బంగారం మాదిరి విలువ నీకు

ఒకానొక కల ప్రవహించిన చీకటి రాత్రి
ముసుగులు కప్పుకుని సంక్లిష్ట వలయాలు దాటి
పర్యావరణ సరిహద్దుల కాపలా దాటి
నువ్వొచ్చినపుడు అసంపూర్ణ నిర్మాణమేదో
తళుక్కున మెరుస్తుంది.
ఇసుకేస్తే రాలదంటే
కిక్కిరిసిన జనసందోహానికి కొలమానం
మరి ఇపుడు దీన్నేమంటారు?

ఏది లేదో దానికే మూల్యం
దోసిలి నదిలో
గుప్పెడు ఇసుక
దిగంతాల అంచున ఊరిస్తుంది.

- అనాధలకు ఆదరణ...

# 16న దుప్పట్ల పండుగ

‘ఆకలిగొన్న వారికి అన్నం పెట్టవయ్యా.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవయ్యా’ అన్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి గురువులు ఇచ్చిన సూచనల మేరకు ఆయన శిష్యుడు నెల్లూరు, మూలాపేట బ్రాహ్మణవీధికి చెందిన మాకాని వెంకట్రావు(82) తన నివాసంలో గురునిలయం నిర్మించి 1993లో గురుదేవుల ప్రతిష్ట గావించారు. అప్పటినుండి నేటివరకు భగవాన్ వెంకయ్య సేవలో తరిస్తూ ప్రతి సంవత్సరం నవంబర్ 16న నిరుపేదలకు, అనాధలకు, వృద్ధులకు, రోడ్లపై రాత్రివేళల్లో చలికి తట్టుకోలేక అల్లాడిపోతున్న అభాగ్యులకు, కన్న బిడ్డలు కనికరించక రోడ్డున పడి భారంగా బ్రతుకులీడుస్తున్న వృద్ధులకు ఆపన్నహస్తం అందిస్తూ వారిని అక్కున చేర్చుకుని ఆదరిస్తున్నారు మాకాని వెంకట్రావు. ప్రతి శనివారం పండుగదినాల్లో కూడా గురునిలయంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గత 13సంవత్సరాలుగా ప్రతి ఏటా క్రమం తప్పకుండా దుప్పట్ల పంపిణీ కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు.

ఈ సేవా కార్యక్రమాన్ని గురించి తెలుసుకున్న ఎందరో దాతలు ముందుకొచ్చి మానవత్వంతో తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నారు. ఇంటర్నెట్ ద్వారా తెలుసుకున్న ఇతర రాష్ట్రాల వారు సైతం బాసటగా నిలుస్తున్నారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి జీవించి వున్న కాలంలో శ్రీ స్వామివారికి సేవకుడిగా సపర్యలు చేసి వెంకయ్యస్వామి ఆశీస్సులు అందుకుని పండువయస్సులో నడవలేని స్థితిలో కూడా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ఇలాంటి మహత్కార్యాన్ని నిస్వార్థంగా భక్తుల సహకారంతో నిర్వహిస్తున్నారు. తన నివాసంలో నిర్మించిన గురునిలయంలోని శ్రీ వెంకయ్యస్వామి దర్శనార్థం భక్తులు విశేషంగా తరలివస్తున్నారు. ఇక్కడ విశేషమేమిటంటే 1993లో గురునిలయంలో గురుదేవుల ప్రతిష్ఠ జరిగినప్పుడు ఏర్పాటు చేసిన శ్రీ వెంకయ్యస్వామి విగ్రహంలో 2011లో అద్భుత శారీరక మార్పులు సంభవించాయి. ఈ మార్పును చూసి భక్తులు పులకించిపోతున్నారు.


వెంకయ్యస్వామి సేవలో మాకాని వెంకట్రావు

మాకాని వెంకట్రావు చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్న ఎందరో మహానుభావులు గురునిలయానికి స్వయంగా వచ్చి తమవంతుగా దుప్పట్లును అందిస్తూ చలికాలంలో వృద్ధులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ 16న గురునిలయంలో అనాధలకు దాదాపుగా 1500 దుప్పట్లు, అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించడమే కాకుండా నెల్లూరు నగరంలోని అనాధ ఆశ్రమాలైన విశ్వభారతి అంధుల పాఠశాల, విశాలాక్షి వృద్ధాశ్రమం, వాత్సల్య, క్యాప్, వియానీహోం, ప్రగతి ఛారిటీస్, నెల్లూరుజిల్లా అల్లూరు గొల్లపాలెంలోని శరత్‌బాబుజీ చిల్డ్రన్స్ హోం, చిత్తూరుజిల్లా రేణిగుంట అభయక్షేత్రం వారికి ప్రతి సంవత్సరం వెయ్యి దుప్పట్లు, అన్నదానం చేస్తున్నారు. అనాథలకు, ఆర్తులకు అండగా వుంటున్న మాకాని వెంకట్రావు ధన్యజీవి.

ఇలాంటి మహత్కార్యంలో దాతలు ముందుకొచ్చి తమ సహాయాన్ని నెల్లూరు, ఫత్తేఖాన్‌పేట బ్రాంచి, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నెం. 32791826379, ఐఎఫ్ఎస్ కోడ్ ఎస్‌బిఐ ఎన్0001344కు పంపవచ్చు. మాకాని వెంకట్రావు సెల్ నెం. 9032241814, 9908272492. నవంబర్ 16 ఆదివారం గురు నిలయంలో జరిగే దుప్పట్లు పంపిణీ, అన్నదానం కార్యక్రమంలో అందరూ భాగస్వాములై అనాధలను ఆదుకోవాల్సిన అవసరముంది.

# మహిళలకు కుట్టులో ఉచిత శిక్షణ

**- జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి**



నెల్లూరుజిల్లాలో ఉన్న 10నియోజకవర్గాల పరిధిలోని నెల్లూరు నగరం, 46మండలాల్లో విడతల వారీగా మహిళా ఉపాధి శిక్షణ కార్యక్రమం క్రింద ఆయా మండల కేంద్రాల్లో నిరుపేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా జడ్పీ కార్యాలయంలోని ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో అనేకమంది మహిళలు గ్రామాల్లో ప్రత్యామ్నాయ వృత్తిని నేర్చుకునేందుకు సరైన అవకాశాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారని, అలాగే విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి మహిళలకు యుక్తవయస్సు కిశోర బాలికలకు జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గంలోని ఒక్కో మండలంలో 5కుట్టుమిషన్లు, ఒక ఇన్‌స్ట్రక్టర్‌ని ఏర్పాటు చేసి ఒక్కో బ్యాచ్‌కి 50మంది వంతున కుట్టు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్ తమ మూడు నెలల కోచింగ్ పూర్తి చేసుకునేలోగా దీనిలో ఉండే సాధకబాధకాలపై పరిశీలన జరిపి అనంతరం 46మండలాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. రానున్న 5సంవత్సరాల్లో దాదాపు కోటిరూపాయల ఖర్చుతో 50వేల మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్‌లో మహిళా, శిశు సంక్షేమానికి సంబంధించి ప్రత్యేకనిధి ఉందని అందులో నుండి ఈ కార్యక్రమానికి నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు బ్యాంకర్లతో మాట్లాడి కుట్టుమిషన్‌లు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో అతినిరుపేదలకు బ్యాంకులకు కట్టాల్సిన రూ.1000లు లేదా 1200లు మార్జిన్ మనీని జిల్లా పరిషత్ నిధుల నుండే చెల్లించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ అతిథిగృహం మరమ్మత్తులకు రూ.15లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ నూతన భవనానికి అనుబంధంగా పంచాయితీరాజ్ విభాగాలకు చెందిన కార్యాలయాన్ని ఒకే సముదాయంలో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.



ఈ నెల 14వ తేదీన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నెల్లూరు మద్రాసుబస్టాండు వద్దగల ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, పక్కన కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బి.రాఘవేంద్రరెడ్డి, మేయర్ అజీజ్, కమిషనర్ చక్రధర్‌బాబు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

# డబ్బుకు 'బాబు' దాసోహం

**మాజీఎమ్మెల్యే ఆనం వివేకా ఫైర్**

వంద, రెండొందల కోట్లు ఖర్చు పెట్టిన వారికి చంద్రబాబు మంత్రి పదవి కట్టబెట్టారని, పది సంవత్సరాల పాటు పార్టీ కోసం ఎండనకా, వాననకా పార్టీని మోసిన వారిని పక్కనపెట్టిన చంద్రబాబు ఒక మోసకారి అని మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఫైర్ అయ్యాడు. ఆది వారం నెల్లూరు నగరం ఏసి సెంటర్‌లో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీని వీడినవారు నమ్మకద్రోహులని, అలాంటి నమ్మక ద్రోహులను టిడిపిలో చేర్చుకోవడం ఒక అద్భుతమన్నారు. బారాషహీద్ దర్గా రొట్టెలపై తనకు నమ్మకం ఉందన్నారు. గత ఏడాది తనకు ఆరోగ్యం బాగా లేకపోతే తన మిత్రులు ఆరోగ్య రొట్టెను తెచ్చి ఇవ్వడంతో ఆరోగ్యం కుదుట పడిందన్నారు.

**వ్యాపారులకు అండగా ఉంటా...**

ఈ సందర్భంగా ఆయన నెల్లూరు నగరంలోని వ్యాపారులకు అండగా వుంటానని భరోసా ఇచ్చారు. నెల్లూరును రోడ్ల విస్తరణ పేరుతో శిథిలావస్థగా మార్చవద్దన్నారు. కౌన్సిల్‌ను పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్పొరేటర్ల అభిప్రాయాలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వ్యాపారుల్ని ఒప్పించి మెప్పించి తీసుకోవాలే తప్ప రాజులు, ఐఏఎస్, ఐపిఎస్, నవాబులం అంటూ ప్రజల పట్ల ఇష్టానుసారంగా పోతే కుదరదన్నారు. నెల్లూరులో రోడ్ల విస్తరణ పేరుతో చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలు కష్టపడి కట్టుకున్న భవనాలను నిలువునా కూల్చేయడానికి కార్పొరేషన్ అధికారులు, పాలకులు సిద్ధమయ్యారంటూ మండిపడ్డారు. ప్రజలను ఒప్పించిన తర్వాతే రోడ్డు విస్తరణ చేపట్టాలని లేకుంటే ప్రజాఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# వైద్యకళాశాల రోడ్ల నిర్మాణంలో ఆలస్యమెందుకు?

**- నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**



నెల్లూరు దర్గామిట్ట ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నిర్మించిన ప్రభుత్వ వైద్యకళాశాలలో అంతర్గతరోడ్లను పూర్తి చేయకుండా ఆలస్యం ఎందుకు చేస్తున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. బుధవారం నెల్లూరు ప్రభుత్వ వైద్యకళాశాలను ఎమ్మెల్యే కోటంరెడ్డి పరిశీలించి ప్రిన్సిపల్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుతం వైద్యకళాశాలలో తరగతులు, విద్యార్థుల సమాచారం, వారికి కల్పించిన వసతులు గురించి తెలుసుకున్నారు. కళాశాల ప్రాంగణంలో అంతర్గత రోడ్లు నేటికీ పూర్తి కాకపోవడంపై స్థానిక ఇంజనీరింగ్ అధికారులపై కోటంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యకళాశాల ప్రారంభమై నాలుగునెలలు గడిచినా నేటికీ రోడ్లు పూర్తి చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సత్వరమే చర్యలు తీసుకుని పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ రోడ్ల కోసం రూ.7కోట్లతో టెండర్లు పిలిచి నాలుగునెలలు గడిచాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా॥ ప్రభాకర్, ప్రొఫెసర్ డా॥ రాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 7మంది డిఎస్పీలకు పోస్టింగ్

పోలీసుస్టేషన్ల రీ ఆర్గనైజేషన్‌లో భాగంగా జిల్లాకు ఏడుగురు డిఎస్పీలను కేటాయిస్తూ డిజిపి జె.వి.రాముడు ఆదేశాలు జారీచేశారు. ఐ.రామకృష్ణను స్పెషల్ బ్రాంచ్2 డిఎస్పీగా, ఇ.శ్రీనివాస్‌ను ఎస్సీ, ఎస్టీ సెల్-2 డిఎస్పీగా, ఎం.జనార్ధన్‌ను నెల్లూరు ట్రాఫిక్ డిఎస్పీగా పి.శ్రీధర్‌ను నెల్లూరు క్రైమ్ డిఎస్పీగా, జి.నాగసుబ్బన్నను మహిళా డిఎస్పీగా, నారాయణస్వామిరెడ్డిని డిసిఆర్‌బి డిఎస్పీగా, ఏ.పాల్‌రాజ్‌ను ఎస్సీ, ఎస్టీ సెల్-1 డిఎస్పీగా నియమించారు.

# రైళ్లలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

**- రైల్వే ఎస్పీ జనార్ధన్**



రైళ్లలో జరిగే దొంగతనాల నియంత్రణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రైల్వే ఎస్పీ జనార్ధన్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నేరాల నియంత్రణకు కృషి చేస్తూ ప్రయాణీకుల భద్రతకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైళ్లలో జరిగే ప్రమాదాల నివారణకు ఆర్‌పిఎఫ్‌తో పాటు స్థానిక పోలీసులు, డాగ్‌స్క్వాడ్ సహకారంతో కృషి చేస్తామన్నారు. స్పెషల్ టీంలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ద్వారా సంయుక్తంగా రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తూ టికెట్‌లేని ప్రయాణీకులపై చర్యలు తీసుకుంటామన్నారు. అల్లూరు, తలమంచి, రాజుపాలెం ప్రాంతాల్లో రైళ్లలో జరుగుతున్న చోరీలపై ప్రత్యేకదృష్టి ఉంచామన్నారు. హిజ్రాలకు కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా వారు నేరాల బాట పట్టకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రైల్వే ప్రయాణీకులు ఏదైనా అనుమానాస్పద వస్తువులను, వ్యక్తులను గమనిస్తే సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో రైల్వే ఆర్‌పిఎఫ్ డిఎస్పీలు రాజేంద్రకుమార్, సూర్యచంద్రరావు, పొన్నురాజు, ఇన్‌స్పెక్టర్లు రవిశంకర్, విజయకుమార్ ఎస్ఐ సుభాన్ పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com